# శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 96, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం -25 - జూన్ - 2025


## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై అనుమానాలను నివృత్తి చేయాలి



- మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- "తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు
- పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి
- కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు

అమరావతి: పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది." అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను

మిగతా..2లో

## జాలో ఆగని మారణహోమం

### ఇజ్రాయెల్ దాడులతో 56,000 దాటిన మృతుల సంఖ్య

గాజాలో మరింత పెరిగిన మృతుల సంఖ్య



2023 అక్టోబర్ 7 నుంచి 56,077 మంది మృతి

గాయపడిన వారి సంఖ్య 1,31,848కి చేరిక

ఈ ఏడాది మార్చి 18 నుంచే 5,759 మంది మరణం

2లో



## కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక టాస్క్..!

జూలై 1 నుంచి ఎన్డీయే ఎమ్మెల్యేల్ని జనంలోకి పంపాలి



2లో

## ఫోన్ ట్యాపింగ్ ఎవరి ఆదేశాలతో చేశారు?: ఈటల రాజేందర్ నిలదీత

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు ఈటల వాంగ్మూలం
- ప్రభాకర్ రావు ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ చేశారో చెప్పాలన్న ఈటల
- హుజూరాబాద్, గజ్వేల్, మునుగోడు ఎన్నికల్లో తన ఫోన్ ట్యాప్ చేశారని ఆరోపణ

## మహంకాళి బోనాలు... గత ఏడాది తప్పులు పునరావృతం కావొద్దు

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఏర్పాట్లపై పొన్నం సమీక్ష
- రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని విన్నపం
- అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశం



సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, స్థానికులు, భక్తుల భాగస్వామ్యం ఎంతో

మిగతా..2లో

## దంగేటి జాహ్నవిని అభినందించిన జగన్



వ్యోమగామి అభర్యర్థిగా ఎంపికైన జాహ్నవి

ప్రతి భారతీయుడికి, ఆంధ్రుడికి గర్వకారణమన్న జగన్

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

అమరావతి: భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తూ, యువ ప్రతిభావంతురాలు కుమారి జాహ్నవి దంగేటి అరుదైన ఘనత సాధించారు. ప్రతిష్టాత్మక టైటాన్స్ స్పేస్ సంస్థ నిర్వహించే ఆస్కాన్ ప్రోగ్రామ్‌కు ఆమె ఆస్ట్రోనాట్ క్యాండిడేట్ (వ్యోమగామి అభ్యర్థి)గా ఎంపికయ్యారు. 2029లో చేపట్టతలపెట్టిన అంతరిక్ష యాత్ర కోసం ఆమె ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ వార్త తెలియగానే జాహ్నవికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అధినేత జగన్ కూడా జహ్నవిని అభినందించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... "అంతరిక్షయానానికి ఎంపికైన తొలి భారతీయ యువతి, అందునా ఏపీకి చెందిన యువతి కావడం ప్రతి భారతీయుడికి, ఆంధ్రుడికి గర్వకారణం. ఎంతోమందికి జాహ్నవి స్ఫూర్తిగా నిలుస్తుంది. భవిష్యత్తులో జాహ్నవి మరిన్ని విజయాలు సాధించాలి" అని ఆకాంక్షించారు. టైటాన్స్ స్పేస్ అనేది అంతరిక్ష పరిశోధనలు, యాత్రల రంగంలో పనిచేస్తున్న ఒక ప్రముఖ సంస్థ. ఈ సంస్థ వ్యోమగాములను తయారుచేయడానికి ప్రత్యేకంగా ఆస్కాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మిగతా..2లో

# ఆ ముగ్గురూ సంపన్నులెలా అయ్యారు

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

- రైతులకే తమ ప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యం
- గత కేసీఆర్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ధ్యేయమని ప్రకటన
- పదేళ్ల బీఆర్ఎస్, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ హయాంలో అప్పుల కుప్పగా మారితే, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు మాత్రం ఎలా సంపన్నులయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, తమ 18 నెలల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్ల నిధులను జమ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రైతుల ఆశీర్వాదం వల్లే తాను చిన్న వయసులోనే ముఖ్యమంత్రి

మిగతా..2లో

## సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు



హైదరాబాద్: రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.




2లో

## అది ఫేక్ వీడియో అంటారా?... జగన్‌పై షర్మిల ఫైర్

- నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- జగన్ పర్యటనలో సింగయ్య మృతి ఘటనపై తీవ్ర ఆవేదన, బాధ్యత జగన్‌దేనని ఆరోపణ
- జగన్‌కు నిబంధనలు వర్తించవా అంటూ ప్రశ్నల వర్షం

## బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

### 'రాహుల్ గాంధీ రహస్య విదేశీ యాత్ర'...

రాహుల్ గాంధీ లండన్ పర్యటనపై రాజకీయ వివాదం

మేనకోడలి గ్రాడ్యుయేషన్ కోసమే వెళ్లారని కాంగ్రెస్ స్పష్టీకరణ

రాహుల్ తరచూ విదేశీ పర్యటనలపై బీజేపీ ఐటీ చీఫ్ మాలవీయ విమర్శ

ప్రతిపక్ష నేతగా వివరాలు చెప్పాలని డిమాండ్



ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ విదేశీ పర్యటన మరోసారి రాజకీయ దుమారానికి దారితీసింది. ఆయన ప్రస్తుతం లండన్‌లో ఉన్నారని, తన మేనకోడలి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని కాంగ్రెస్ పార్టీ మంగళవారం వెల్లడించింది. అయితే, రాహుల్ గాంధీ

మిగతా..2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి



2లో

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నాయి

త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలి

## ఇరాన్‌కు మా పూర్తి మద్దతు అణుకేంద్రాలపై దాడులను ఖండిస్తున్నాం: రష్యా



2లో

ఇరాన్‌కు మద్దతు విషయంలో తమ వైఖరి స్పష్టమని రష్యా ప్రకటన

టెహ్రాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసుకుంటామని వెల్లడి

ఇరాన్ అణుకేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను తీవ్రంగా ఖండించిన రష్యా

## ఇజ్రాయెల్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు దేశాలూ ఉల్లంఘించాయని వెల్లడి



2లో

వెంటనే పైలట్లను వెనక్కి పిలవాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక

ఇజ్రాయెల్ చర్యపై తాను సంతోషంగా లేనన్న అమెరికా అధ్యక్షుడు

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై అనుమానాలను నివృత్తి చేయాలి

మొదటి పేజి తరువాయి



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, విరాళాలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

### ఏపీ మంత్రివర్గ సమావేశం ప్రారంభం..

### ఎజెండాలో కీలక అంశాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం . ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న వివిధ నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. విశాఖలో దిగ్గజ ఐటీ సంస్థ కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాల భూమిని ఎకరా 99పైసలకు కేటాయించే ప్రతిపాదనను ఆమోదించనుంది. రూ.1582.98 కోట్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. 49వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశముంది. రాజధాని అమరావతిలో పరిపాలనా భవన నిర్మాణాలకు టెండర్లు దక్కించుకున్న సంస్థలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది. రూ.882.47 కోట్లతో జీఏడీ టవర్, రూ.1487.11 కోట్లతో హెచ్ఓడీ కార్యాలయాలు, రూ.1303.85కోట్లతో ఇతర పరిపాలనా భవనాల నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న సంస్థలకు క్యాబినెట్ అనుమతులు మంజూరు చేయనుంది. రాష్ట్రంలో పలు సంస్థలకు భూ కేటాయిం పులపై మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ చట్టంలో పలు నిబంధనల సవరణలకు ఆమోదముద్ర వేయనుంది. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్ సాయికి స్పోర్ట్స్ కోటా కింద డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం కల్పించే అంశంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. కుప్పం నియోజకవర్గంలో నీటి వనరులకు సంబంధించి 51 పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వనుంది.

## ఆ ముగ్గురూ సంపన్నులెలా అయ్యారు

మొదటి పేజి తరువాయి

రైతుల ఆశీర్వాదం వల్లే తాను చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయ్యానని, వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమ ప్రజా ప్రభుత్వంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఆ తర్వాతే మహిళలు, యువతకు స్థానం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగలా మార్చేందుకే వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశామని ఆయన తెలిపారు. గతంలో వరి వేసుకుంటే ఉరేననే పరిస్థితి ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పి, 48 గంటల్లోనే డబ్బులు జమ చేశామని వివరించారు. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమని, వ్యవసాయం అంటే రైతును రాజును చేయడమేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ రాష్ట్రం నెత్తిన రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు పెట్టి వెళ్లారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం కూడా జరిగిపోయిందని విమర్శించారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వారంతా ఎలా సంపన్నులయ్యారు?" అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలు కల్పించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' తీసుకువచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఇందుకోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని, వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. మహిళలకు రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించి ఆదుకున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించామని అన్నారు. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని, 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళలకే అప్పగించామని వివరించారు. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను కూడా స్వయం సహాయక సంఘాలకే అప్పగించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

## బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

మొదటి పేజి తరువాయి

అయితే, రాహుల్ గాంధీ తరచూ విదేశాలకు వెళ్లడంపై, ఆ వివరాలు గోప్యంగా ఉంచడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ పరిణామంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల తీరును తప్పుబడుతూ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. "రాహుల్ గాంధీ గత వారమే ఓ రహస్య విదేశీ పర్యటన ముగించుకువచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో అజ్ఞాత ప్రదేశానికి విదేశాలకు వెళ్లారు" అని మాలవీయ తన పోస్ట్‌లో ఆరోపించారు. "ఈ తరచూ అదృశ్యమవ్వడాలు ఎందుకు? దేశానికి దూరంగా ఆయనను అంతగా ఆకర్షిస్తున్న విషయం ఏమిటి? లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, భారత ప్రజలకు ఆయన ఈ విషయాలపై సమాధానం చెప్పి తీరాలి" అని అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు. అమిత్ మాలవీయ చేసిన విమర్శలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, బీజేపీ ఆరోపణలను ఖండిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)పై ఎదురుదాడికి దిగారు. "ప్రధానమంత్రి కార్యాలయం ఎప్పటిలాగే తన నీచమైన కుయుక్తులకు పాల్పడుతోంది. వారికి అంతకు మించి ఏమీ తెలియదు" అని పవన్ ఖేరా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. "రాహుల్ గాంధీ తన మేనకోడలి గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు లండన్ వెళ్లారు. త్వరలోనే ఆయన తిరిగి వస్తారు" అని ఖేరా స్పష్టం చేశారు. ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రాల కుమార్తె మిరాయా వాద్రా యూకేలో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిసింది. రాహుల్ గాంధీ న్యూఢిల్లీ నుంచి బహ్రెయిన్ మీదుగా లండన్ వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు కూడా ధృవీకరించాయి.

## అది ఫేక్ వీడియో అంటారా?... జగన్‌పై షర్మిల ఫైర్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం నాడు నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె తన సోదరుడు, వైసీపీ అధ్యక్షుడు జగన్ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రతి విషయంలోనూ జగన్ ప్రజలను వంచించారని, అధికారం చేతిలో ఉన్నప్పుడు ప్రజల వద్దకు వెళ్లని ఆయన, ఇప్పుడు ఓటమి తర్వాత జన సమీకరణ పేరుతో బల ప్రదర్శనలకు దిగుతున్నారని ఆమె మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషాద ఘటనపై షర్మిల స్పందించారు. జగన్ కారు సైడ్ బోర్డుపై నిలబడి ప్రయాణించడం మొదటి తప్పని, ఆయన షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోను ఫేక్ అని ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. జగన్ తీరును తూర్పారబడుతూ షర్మిల, "జగన్‌కు ఏ నిబంధనలు, ఆంక్షలు వర్తించవా? మూడు వాహనాలకు అనుమతి ఉంటే, ఏకంగా ముప్పై వాహనాలతో వెళుతున్నారు. కార్ల కింద అమాయకులను నలిపేస్తూ, మానవత్వం గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసం?" అని తీవ్రంగా ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే ధైర్యం కూడా జగన్‌కు లేదని ఆమె దుయ్యబట్టారు. "రుషికొండలను ఎందుకు బోడిగా మార్చారు? మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి, మద్యం కుంభకోణానికి ఎందుకు పాల్పడ్డారు?" అంటూ జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి నిలబెట్టాల్సిన అవసరం ఉందని భావించే అధిష్ఠానం తనను ఇక్కడికి పంపిందని షర్మిల తెలిపారు. తనకు, జగన్‌కు మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాలు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలతో పోలిస్తే చాలా చిన్నవని ఆమె అన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే తమ మధ్య విభేదాలు తలెత్తాయని ఆమె వెల్లడించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగలిగే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని షర్మిల ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మహంకాళి బోనాలు... గత ఏడాది తప్పులు పునరావృతం కావొద్దు

మొదటి పేజి తరువాయి



ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, స్థానికులు, భక్తుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన నొక్కిచెప్పారు. జూలై 13, 14 తేదీలలో జరగనున్న ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉదయం దేవాలయ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయా శాఖలు చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారికి ఆతిథ్యం ఇవ్వడంలో నగర ప్రజలు ఎప్పుడూ ముందుంటారని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని మంత్రి కోరారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో, తలపై బోనాలతో అమ్మవారి దర్శనానికి వచ్చే మహిళా భక్తులకు ప్రాధాన్యతనిచ్చి, వారు త్వరగా దర్శనం చేసుకునేలా చూడాలని, వీఐపీలు సైతం ఇందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఎదురైన చిన్న చిన్న సమస్యలను సమీక్షించుకొని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా దేవాలయం లోపల, వెలుపల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. గోల్కొండ, బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, లాల్ దర్వాజ బోనాలతో పాటు నగరంలోని సుమారు 3000 దేవాలయాల వద్ద జాతరలను విజయవంతం చేసేందుకు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర జరిగే ప్రాంతాల్లో అదనపు మంచినీటి సరఫరా చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, దేవాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో పూర్తిగా సీసీ రోడ్లు, అవసరమైన చోట్ల బీటీ రోడ్లు నిర్మించాలని కోరారు. గతంలో ఇక్కడ పనిచేసి, అనుభవం ఉన్న పోలీస్ ఇన్ స్పెక్టర్లను నియమిస్తే బందోబస్తు ఏర్పాట్లు మరింత సమర్థవంతంగా ఉంటాయని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ హరిచందన, జాయింట్ కమిషనర్ విక్రం సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్, డీసీపీ రష్మి పెరుమాళ్, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్ చీర సుచిత్ర, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, ఆలయ ఈవో మనోహర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దంగేటి జాహ్నవిని అభినందించిన జగన్

మొదటి పేజి తరువాయి



ప్రత్యేకంగా ఆస్కాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కఠినమైన ఎంపిక ప్రక్రియల అనంతరం, అత్యంత ప్రతిభ కనబరిచిన వారిలో ఒకరిగా జాహ్నవి దంగేటి ఈ కార్యక్రమానికి ఎంపిక కావడం విశేషం. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఆమె వ్యోమగామిగా అవసరమైన సమగ్ర శిక్షణను పొందనున్నారు. అనంతరం, 2029లో ప్రణాళిక చేసిన అంతరిక్ష యాత్రలో పాలుపంచుకునే అవకాశం దక్కించుకున్నారు.

## రాజస్థాన్ లో 3,500 ఏళ్ల నాటి పురాతన నది ఆనవాళ్లు!



రాజస్థాన్: రాజస్థాన్‌లోని దీగ్ జిల్లా బహజ్ గ్రామంలో భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) జరిపిన తవ్వకాల్లో ఓ అద్భుత ఆవిష్కరణ వెలుగుచూసింది. భూమికి 23 మీటర్ల లోతున ఒక ప్రాచీన నదీ ప్రవాహ మార్గం (పాలియోఛానల్) బయట పడింది. ఇది వేదాల్లో ప్రస్తావించిన సరస్వతీ నది జాడలు కావచ్చని, భారత పురావస్తు చరిత్రలోనే ఇది అపూర్వమైన ఆవిష్కరణ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మే వరకు సాగిన ఈ తవ్వకాల్లో క్రీస్తుపూర్వం 3500 నుంచి 1000 మధ్య కాలంలో ఇక్కడ నాగరికత విలసిల్లినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. "ఈ ప్రాచీన నదీ వ్యవస్థ ఆనాటి మానవ ఆవాసాలకు జీవనాధారంగా నిలిచి, బహజ్ గ్రామాన్ని విస్తృతమైన సరస్వతీ నదీ పరీవాహక సంస్కృతితో కలుపుతుంది" అని ఏఎస్ఐ జైపూర్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ వినయ్ గుప్తా తెలిపారు. కుషానులు, మగధ, శుంగ వంశాల కాలంనాటి అవశేషాలు కూడా ఇక్కడ లభ్యమయ్యాయి. తవ్వకాల్లో మట్టి స్తంభాల నివాస గృహాలు, పొరలుపొరలుగా ఉన్న గోడల కందకాలు, కొలిమిలు, వివిధ ఇనుప, రాగి వస్తువులు బయల్పడ్డాయి. సూక్ష్మశిలా పరికరాలు హోలోసీన్ పూర్వ కాలం నుంచే ఇక్కడ మానవ ఉనికిని సూచిస్తున్నాయి. క్రీ.పూ. 1000 నాటి 15 యజ్ఞకుండాలు, శక్తి ఆరాధన మొక్కుబడి చెరువులు, శివపార్వతుల మట్టి విగ్రహాలు ఆధ్యాత్మిక జీవనానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా, బ్రాహ్మీ లిపి అక్షరాలున్న నాలుగు కాల్చని ముద్రికలు (సీలింగ్స్) లభించాయి. ఇవి భారత ఉపఖండంలో బ్రాహ్మీ లిపికి సంబంధించిన అత్యంత పురాతన, కాలాన్ని నిర్ధారించదగిన ఆధారాలు కావచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. మహాజనపదాల కాలం నాటి యజ్ఞకుండాలలో అక్షరాలు లేని రాగి నాణేలు దొరకడం, నాణేల ఆవిర్భావ చరిత్రపై కొత్త వెలుగునిచ్చే అవకాశముంది. ఎముకల పనిముట్లు, విలువైన రాళ్లు, శంఖు గాజులు ఆనాటి హస్తకళా నైపుణ్యాన్ని చాటుతున్నాయి. ఈ తవ్వకాలు భారతదేశ చరిత్రలోని కీలక అధ్యాయాలను తిరగరాయగలవని వినయ్ గుప్తా పేర్కొన్నారు. ఈ స్థల పరిరక్షణకు ఏఎస్ఐ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించింది.

## గాజాలో ఆగని మారణహోమం

### ఇజ్రాయెల్ దాడులతో 56,000 దాటిన మృతుల సంఖ్య

గాజా: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 56,000 మార్కును దాటింది. గాజాలోని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ వివరాలను వెల్లడించింది. 2023 అక్టోబర్‌లో ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో మొత్తం 56,077 మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాకుండా, ఈ దాడుల్లో 1,31,848 మంది పాలస్తీనియన్లు గాయపడ్డారని పేర్కొంది. పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టేలా, ఇటీవలి కాలంలో మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం ఈ ఏడాది మార్చి 18 నుంచి ఇప్పటివరకు జరిగిన దాడుల్లోనే 5,759 మంది పాలస్తీనియన్లు మరణించారని, మరో 19,807 మంది గాయపడ్డారని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. ముట్టడిలో ఉన్న గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు నిరంతరాయంగా కొనసాగుతుండటంతో, ప్రాణనష్టం భారీగా ఉంటోంది.

## ఇరాన్‌కు మా పూర్తి మద్దతు

### అణుకేంద్రాలపై దాడులను ఖండిస్తున్నాం: రష్యా

రష్యా: ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని రష్యా స్పష్టం చేసింది. ఈ విషయంలో టెహ్రాన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేసుకుంటామని ప్రకటించింది. వ్యూహాత్మక భాగస్వామి అయిన ఇరాన్‌కు రష్యా నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదంటూ వస్తున్న విమర్శలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తాజాగా స్పందించారు. "రష్యా-ఇరాన్ మధ్య ఉన్న బలమైన బంధాన్ని దెబ్బతీయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు" అని పెస్కోవ్ ఆరోపించారు. సోమవారం నాడు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారని, ఈ సమావేశంలో క్రెమ్లిన్ పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమైనదని అరాఘ్చి ప్రశంసించారని పెస్కోవ్ గుర్తుచేశారు. ఇదే అంశంపై గతంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు కూడా ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇరాన్‌కు చిరకాల మిత్రదేశమైనప్పటికీ, సంక్లిష్ట సమయాల్లో రష్యా ఆశించినంతగా సాయం చేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనిపై పుతిన్ స్పందిస్తూ, ప్రస్తుత ఉద్రిక్తతల నడుమ తాము ఎందుకు తటస్థ వైఖరిని అవలంబిస్తున్నారో వివరించారు. "గతంలోని సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన సుమారు 20 లక్షల మంది ప్రజలు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడు ఇజ్రాయెల్ దాదాపుగా రష్యన్ భాష మాట్లాడే దేశంగా మారింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో మేం తటస్థంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నాం" అని పుతిన్ వెల్లడించారు. మిత్ర దేశాల పట్ల రష్యా నిజాయతీని కొందరు అనుమానిస్తున్నారని, అలాంటి వారంతా కేవలం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందనడానికి ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేవని పుతిన్ తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని తాము ఇజ్రాయెల్‌కు కూడా స్పష్టం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ చేపడుతున్న శాంతియుత అణు కార్యక్రమానికి మద్దతు ఇవ్వడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పుతిన్ పునరుద్ఘాటించారు.

## ఇజ్రాయెల్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

### ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

అమెరికా: ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, ఇరు దేశాలు పరస్పర దాడులకు పాల్పడటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్‌తో పాటు ఇజ్రాయెల్ కూడా ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి, తక్షణమే తమ పైలట్లను వెనక్కి పిలవాలని, బాంబు దాడులు నిలిపివేయాలని ఆయన గట్టిగా హెచ్చరించారు. ది హేగ్‌లో జరిగే నాటో సదస్సుకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు మళ్లీ దాడులు చేసుకున్నాయనే విషయాన్ని ఆయన ధృవీకరించారు. "ఇరాన్‌తో పాటు ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణను ఉల్లంఘించింది. ఇజ్రాయెల్ చర్య పట్ల నేను సంతోషంగా లేను. టెల్ అవీవ్ శాంతించాలి. అదే నేను కోరుకుంటున్నా" అని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇజ్రాయెల్.. ఆ బాంబులను వేయొద్దు. అలా చేస్తే అది తీవ్ర ఉల్లంఘనే అవుతుంది. మీ పైలట్లను తక్షణమే వెనక్కి రప్పించండి" అని డొనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో గతంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచిన ట్రంప్, గత రెండు వారాల వ్యవధిలో మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు ఇలా బహిరంగంగా, సూటిగా హెచ్చరికలు జారీ చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

### ఫోన్ ట్యాపింగ్ ఎవరి ఆదేశాలతో చేశారు?

## ఈటల రాజేందర్ నిలదీత

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్లను ట్యాపింగ్ చేశారో స్పష్టం చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి నేడు సిట్ ముందు హాజరై ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం ఈటల మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, గతంలో తన ఫోన్‌ను అనేక సందర్భాల్లో ట్యాప్ చేశారని ఆరోపించారు. "నేను హుజూరాబాద్‌లో పోటీ చేసినప్పుడు, 2023లో గజ్వేల్‌లో ఎన్నికల బరిలో నిలిచినప్పుడు అత్యంత దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్‌ను ట్యాప్ చేశారు. అంతేకాకుండా, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మేం ఎవరితో సంభాషిస్తున్నాం, ఎలాంటి వ్యూహాలు రచిస్తున్నామనేది కూడా ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణలను సైతం కాల్ డేటాలో పొందుపరిచారు. ధైర్యంగా ఎదుర్కోలేనివారే ఇలాంటి చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడతారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాకర్ రావు నియామకంపై కూడా ఈటల రాజేందర్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. "ప్రభాకర్ రావు ఐపీఎస్ అధికారి కాకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా ఆయనను ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. ఒక విశ్రాంత అధికారిని కీలకమైన పదవిలో అక్రమంగా కొనసాగించారు. మార్గదర్శకాలన్నింటినీ తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు లాంటిది. ఈ వ్యవహారంలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా, జడ్జిలు, మంత్రులు, పార్టీల ముఖ్య నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు" అని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగం మొత్తం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లోనే నడిచిందని ఈటల విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను ఇప్పటికీ ప్రభుత్వం బయటపెట్టకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. "ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లాలూచీ పడకపోతే, ఈ విచారణ నివేదికలను ఎందుకు వెల్లడించడం లేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

## కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక టాస్క్..!

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. తాజాగా రెండో ఏడాదిలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా గతేడాది ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కూటమి సర్కార్ సద్వినియోగం చేసుకుందా లేక చతికిలపడుతోందా అన్న దానిపై పలు సర్వేలు వచ్చాయి. వీటిలో ప్రభుత్వ పనితీరుకు మంచి మార్కులే పడుతున్నా ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం జనం పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తిగానే కనిపిస్తున్నారు. కేబినెట్ భేటీలతో పాటు పలు సందర్భాల్లో ఎమ్మెల్యేలను అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని, జనంలో ఉండాలని కోరుతూనే ఉన్నారు. అయినా ఇప్పటికీ చాలా మంది ఎమ్మెల్యేలు చంద్రబాబు మాటల్ని లైట్ తీసుకొంటున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదే విషయం తాజా సర్వేలు కూడా కుండబద్దలు కొట్టేశాయి. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో కూటమి ఏడాది పాలనపై మరోసారి మంత్రులతో చర్చించిన చంద్రబాబు.. అనంతరం కీలక నిర్ణయం ప్రకటించారు. జూలై 1 నుంచి ఎన్డీయే ఎమ్మెల్యేల్ని జనంలోకి పంపాలని నిర్ణయించారు. ఈ మేరకు కూటమి సర్కార్ ఏడాది పాలన విజయాల్ని జనంలోకి తీసుకెళ్లి వివరించాలని వారిని కోరబోతున్నారు. ప్రభుత్వం ఎంత బాగా పనిచేసినా దాన్ని చెప్పుకోవడంలో విఫలమైతే ప్రజలు ఆదరించరనే విషయాన్ని గుర్తించాలని ఎమ్మెల్యేలకు ఆయన సూచిస్తున్నారు. కాబట్టి జూలై 1 నుంచి ఎమ్మెల్యేలను జనంలోకి పంపడానికి వీలుగా కొత్త కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రకటించబోతున్నారు. తాజా సర్వేల్లో ఎమ్మెల్యేల పనితీరుపై ఎక్కువగా ఆరోపణలు రావడం, తాను చేయిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేల్లో సైతం ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు వస్తుండటంతో ముందుగా ప్రక్షాళన వారి నుంచే మొదలుపెట్టాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. తిరిగి అదే ప్రజల వద్దకు వెళ్లి తాము చేసిన మంచి పనుల్ని చెప్పుకునేలా, అలాగే ప్రభుత్వం విజయాల్ని సైతం వివరించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి

హైదరాబాద్: రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు. "మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. " కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం" అని సీఎం అన్నారు.

### పది ఏండ్లు నిర్వీర్యం అయిన రేషన్ కార్డులు..

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరు చేశాం

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్- 24: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్.కే గార్డెన్స్ లో పెద్దపల్లి మండలం మరియు పట్టణానికి సంబంధించిన 480 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను స్థానిక తహసీల్దార్ మరియు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేసిన. పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. పది సంవత్సరాలు బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రేషన్ కార్డులను మన ప్రజా ప్రభుత్వం అధికారంలోని వచ్చాక మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన అనే కార్యక్రమంతో పేద ప్రజలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. గత బి.ఆర్.ఎస్ పార్టీ పేద ప్రజలను మోసం చేస్తూ సంక్షేమం విషయంలో ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. అలాగే పది ఏండ్లు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు కాంగ్రెస్ సర్కార్ మేలు చేస్తోందని అన్నారు. రేషన్ కార్డు ద్వారా పంపిణీ చేసే బియ్యంపై చాలా పేద కుటుంబాలు ఆధారపడి ఉంటాయని వారికి తీవ్ర అన్యాయం చేసిన ఘనత బి.ఆర్.ఎస్ ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి వారికి సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని గుర్తు చేశారు. రేవంతన్న సర్కార్ విద్యా మరియు వైద్యంపై చిత్తశుద్ధితో పని చేస్తుందని అలాగే 5 లక్షలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని 10 లక్షలకు పెంచి పేద ప్రజల వైద్యానికి తోడ్పాటును అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి మహిళామణులకు మేలు చేస్తున్నామని పెద్దపల్లి చిరకాల స్వప్నం అయిన బస్సు డిపోను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మంజూరు చేయించుకోవడం జరిగిందని త్వరలో బస్సు డిపో పనులు ప్రారంభించుకోవడం జరుగుతుందని. అలాగే కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు వెన్నంటే ఉందని రైతు భరోసా ద్వారా రైతన్నల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయడం జరిగిందని రైతు మొహంలో చిరునవ్వు చూడటమే మా ధ్యేయం అని అన్నారు. రైతులు పండించిన పంటలో కూడా తరుగు పెట్టి రైతుల నడ్డి విరిచిన ప్రభుత్వం బి.ఆర్.ఎస్ ప్రభుత్వం అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నేను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత మన నియోజకవర్గంలో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతన్నల మొహంలో చిరునవ్వు చూశామని తెలిపారు. మన పెద్దపల్లి నియోజకవర్గంలో వడ్ల బోనస్ ఘనియంగా జమ చేయడం మనకు గర్వకారణం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని వేళల ప్రజల మద్దతు ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, సింగల్ విండో చైర్మన్లు, డైరక్టర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

## సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూన్ -24: జులై 9 దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ముద్రించిన కరపత్రాలను స్థానిక వ్యవసాయ మార్కెట్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ, కార్మికులకు నష్టం చేస్తూ, యజమానులకు లాభం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులందరికీ నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని కార్మిక,ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి, ఈ సమ్మెలో జిల్లాలోని మునిసిపల్ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు, కేంద్ర ప్రభుత్వం తెచ్చే నాలుగు లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే ప్రస్తుతం 8 గంటల పని విధానం 12 గంటలుగా మారుతుందని,సమ్మె హక్కు నిర్వీర్యం అవుతుందని, ఇప్పటివరకు కార్మికులకు అందుతున్న పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, సెలవులు లాంటి సంక్షేమ చర్యలన్నీ ఆపివేస్తారని అసలు కార్మిక సంఘాలు పెట్టుకునే అవకాశాన్ని లేకుండా ఈ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని అందుకే కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే ఈ నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సావణ పెల్లి వెంకటస్వామి, నాయకులు బొంకూరి సాగర్, కుక్క అన్వేష్, చింతల మరియా, సలిగంటి సుశీల, బొంకూరి శంకర్, మద్దెల రాజయ్య, కాలవల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ భూముల

## జోలికి వస్తే ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తాం : ఎస్ఎఫ్ఐ




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): మంద శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ కాకతీయ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే స్థానిక ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ మంద శ్రీకాంత్ అన్నారు మంగళవారం రోజున కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించినారు సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు కట్టేందుకు యూనివర్సిటీ భూముల ను 15 ఎకరాలను స్థానిక ఎమ్మెల్యే గారు కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ మరియు పాలకమండలి సభ్యులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని కాకతీయ యూనివర్సిటీలో 15 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూలు కట్టేందుకు ఆమోదం తెలుపుకున్నారన్నారు ఎవరిని అడిగి వారు ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేసుకొని ఆమోదం తెలుపుకున్నారని మేము అడుగుతున్నామన్నారు గతంలో యూనివర్సిటీ భూములను కొంతమంది దుండగులు కబ్జా చేసిన కూడా ఇప్పటివరకు వారి పైన ఎలాంటి చర్యలను తీసుకోలేదన్నారు అలాగే ఈ కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్నటువంటి సిఆర్పిఎఫ్ డిపార్ట్మెంట్ వారు కూడా తొమ్మిది ,పది ఎకరాలను ఆక్రమించి వాడుకుంటున్నారన్నారు మళ్లీ ఇప్పుడు కొత్తగా యూనివర్సిటీలో 15 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు కట్టేందుకు పన్నాగం పన్నుతున్నారన్నారు ఇంటిగ్రేటెడ్ స్కూలు కాకతీయ యూనివర్సిటీలో కాకుండా బయట కట్టాలన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు యూనివర్సిటీ భూముల జోలికి ఎందుకు వస్తున్నారు అని అన్నారు మొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ఈరోజు కాకతీయ యూనివర్సిటీ భూములే మీకు మీ ప్రభుత్వానికి కనబడుతున్నాయా అని అన్నారు స్థానిక ఎమ్మెల్యే గారు కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గారు మరియు పాలక మండల సభ్యులు కాకతీయ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ స్కూలు కట్టేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు మేము పూర్తిగా మీరు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు మీరు ఇలానే ఎక పక్షంగా ఉంటే హనుమకొండ నగరంలో ఉన్నటువంటి స్థానిక ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామన్నారు రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని యూనివర్సిటీలలో విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తాయని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్ బిరెడ్డి జస్వంత్ దాసరి అఖిల్ అనిల్ రత్నం నరేష్ పృథ్వి పవన్ కుమార్ సందీప్ ప్రదీప్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

### రాష్ట్రాల అధ్యక్షులు శ్రీ దేవలూటి శంకర్" తెలంగాణలో పర్యటన



హైదరాబాద్, శుభోదయం న్యూస్: ఈ నెల 26, 27, 28 తేదీలలో గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నట్లు "రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు శ్రీ దేవలూటి శంకర్" ఒక ప్రకటన లో తెలిపారు. రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, ఉన్నత విద్య, స్కాలర్షిప్స్, ఎడ్యుకేషన్ గైడెన్స్, తదితర విషయాలు శంకర్ గారితో చర్చించవచ్చు అని ఆయన తెలిపారు. రజక ఉద్యోగ, ఉపాధ్యాయులు, రజక నాయకులు కలిసి ప్రత్యక్షంగా మాట్లాడాలనుకునేవారు నా మొబైల్ నెంబర్స్ 8096646072 /6304330529 కి సంప్రదించవచ్చు.. విద్యార్థినీ, విద్యార్థులు వాటి తల్లిదండ్రులు, విద్యాపరమైన కార్యక్రమాలు కలిసి చర్చించవచ్చు. రజక పేద విద్యార్థులు, వారీ చదువు కి సంబంధించిన అంశాల పైన నాతో సుదీర్ఘంగా చర్చించవచ్చు అని తెలిపారు. తల్లిదండ్రులు లేని పేద రజక విద్యార్థుల గురించిన విషయాలు కూడా ఆయన దృష్టికి తీసుకురావచ్చును అని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంబీబీఎస్ తదితర విద్యకు సంబంధించిన విషయాలను కులంకషంగా చర్చించవచ్చు అని ఆయన తెలిపారు వివిధ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ పోటీ పరీక్షలు రాస్తున్న మన రజక అభ్యర్థులు వారికి సలహాలు సూచనల కోసం నన్ను సంప్రదించవచ్చు ఆ 3 రోజులు సంప్రదించవలసిన వేళలు : ఉదయం 8 నుండి సాయంత్రం 8 గంటల వరకు నేను హైదరాబాద్ లో అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

## అకాల మరణం పొందిన స్నేహశీలి విశ్రాంత ఉద్యోగుల

## సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షి రెడ్డి సంతాప సభ




బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్): సేవా తత్పరుడు నిరాడంబరుడు స్నేహశీలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పనిచేసిన కీ.శే. డాక్టర్ మీనాక్షి రెడ్డి సంతాప సభ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు డాక్టర్ మీనాక్షి రెడ్డి కొడుకు డాక్టర్ మధుసూదన్ రెడ్డి విచ్చేసి అనంతరం కీర్తిశేషులు డా. మీనాక్షి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ ఆయన మెడికల్ ఆఫీసర్ గా పనిచేసి బద్వేల్ ప్రాంత వాసులకు అందరికీ తెలిసిన వ్యక్తిగా సేవా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేవాడని విశ్రాంత సంఘ భవనానికి విశేషంగా కృషిచేసి ఎంతో తోడ్పడ్డాడని, ఆయన కాలములో అనేక చెట్లు నాటి వనవృక్షాన్ని పెంచినాడని వయోవృద్ధులకు రెండు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్ ఏర్పడేసి బీపీ షుగర్ లాంటివి చెక్ చేయడం జరిగిందని వయోవృద్ధులు ఆరోగ్యంగా ఉండే విధంగా కృషి చేసిన వ్యక్తిని ఆయన సేవలు ఉద్యోగుల సంఘానికి ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు పుల్లంరాజు, ఎద్దుల రాం సుబ్బారెడ్డి,కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ రాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముల్లపాటి పిచ్చయ్య,ఉపాధ్యక్షులు ఆనందరావు, రాఘవరెడ్డి లక్ష్మిరెడ్డి మహబూబ్ సాహెబ్ గ్రేసియస్ మెడికల్ ఆఫీసర్ నరసింహారెడ్డి జయరాం రెడ్డి లక్ష్మీనరసయ్య కె.వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

## ప్రభుత్వ పాఠశాల కళాశాలలో

## విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేయండి

### పీ.డీ.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్




కనేకల్, మండల్ విలేఖరి - మాల్యం కిరణ్ కుమార్ జూన్ 25 (శుభోదయం న్యూస్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ డిమాండ్ చేశారుప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కణేకల్ మండలం ఎంఈఓ లేనందున కంప్యూటర్ ఆపరేటర్ పెద్దన్న కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు ప్రారంభం అయిన సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మరియు విద్యార్థులకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు సకాలంలో పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించాలి. అదేవిదంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా పాఠ్య పుస్తకాలు,నోటి పుస్తకాలు అందించాలి, మరియు ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు లను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం గా కోరుచున్నాము, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం, ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్, కణేకల్ మండలం అధ్యక్షులు బాబా పకృద్దీన్, విజయ్,శ్యామ్ ప్రసాద్, సురేష్, వన్నూరుస్వామి, శర్మస్, తదితరులు పాల్గొన్నారు.

### కౌలు రైతులకు కౌలు

### గుర్తింపు కార్డు తప్పనిసరి : మండల వ్యవసాయ అధికారి.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం యాలూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి స్వప్నిక రెడ్డి. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు వలన అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏవో సూచించారు. రైతులకు వరి ,మినుము పంటలకు సంబంధించి సూచనలు సలహాలు,పంట దిగుబడిలో మెలకువలను తెలియజేశారు. కౌలు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి సాగు చేసే రైతు ప్రతి మూడు సీజన్లకు ఒకసారి ఎకరాకు 20 కిలోల జింకును కచ్చితంగా వేసుకోవాలని తెలిపారు. జింకును భాస్వరంఎరువులతో కలిపి వాడరాదని తెలిపారు. భాస్వరం ఎరువులు పైపాటున వేయరాదని సూచించారు . ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ ,అగ్రికల్చర్ అసిస్టెంట్ హరి, రైతులు పాల్గొన్నారు.

### నాగార్జునసాగర్ ఎడమ కాలువ

### 3వ జోన్ ఆయకట్టు గోదావరి జలాలతో స్థిరీకరించాలి




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : నాగార్జునసాగర్ ఎడమ కాలువ బాపులపాడు మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సర్వసభ్య సమావేశం ఈరోజు ఉదయం అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అధ్యక్షతన హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్డులోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బాపులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, నాగార్జునసాగర్ ఎడమ కాలువల ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ గత సీజన్ లో 3వ జోన్ కి సాగు నీటిని విడుదల చేయాలని కె.ఆర్.ఎమ్.బి. నీటి విడుదల ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పై ప్రాంతం నుంచి బాపులపాడు మేజర్ పరిధిలోని ఆయకట్టుకు కనీసం త్రాగునీరు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 3వ జోన్ కు త్రాగునీరు విడుదల చేయాలని అసెంబ్లీలో బయట రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు విశేషంగా కృషి చేసినప్పటికీ సమయాభావం వలన చివరి ప్రాంతానికి సాగునీరు అందలేదని ఎడమ కాలువ 3వ జోన్ లోని 2.36 లక్షల ఎకరాల అయకట్టుతో పాటు గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, మాచవరం, వేంపాడు మేజర్ కింద 30వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించి గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయవలసిన అవసరం ఉందని అన్నారు, బాపులపాడు మేజర్ 19వ కిలోమీటర్ వేలేరు దగ్గర పోలవరం కుడి కాలువ 124 వ కిలోమీటర్ క్రాసింగ్ దగ్గర అండర్ టన్నెల్ ను ఏర్పాటు చేయాలని, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లకు మండల పరిషత్ సమావేశాల్లో సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు గ్రామ పంచాయతీ సమావేశాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవడానికి చర్యలు తీసుకోవాలని డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని కంప తొలగింపు, పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని తదితర తీర్మానాలను సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు గంపా చిన్న పంగిడేశ్వరరావు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కడియాల శ్రీనివాసరావు (బండారుగూడెం), గోళ్ళ గోపి (వేలేరు), మద్దినేని కోటేశ్వరరావు (గన్నవరం), తమ్మిశెట్టి రాంబాబు (మల్లవల్లి) కాంపిటెంట్ అథారిటీ నూజివీడు ఎన్.ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. సీతారావమ్మ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి రెంటచింతల గిరిజన పాఠశాల విద్యార్థి ఎంపిక



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించవచ్చని నిరూపించాడు స్థానిక గిరిజన పాఠశాల విద్యార్థి సంపత్ కుమార్. రెంటచింతల లోని గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలో విద్యను అభ్యసించిన కె సంపత్ కుమార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ మోహన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గిరిజన పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటీ కి ఎంపికవ్వడం ఆ విద్యార్థికి, అతని కుటుంబానికి ఒక గొప్ప విజయం అన్నారు. ఇలాంటి విజయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఇతర గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ట్రిపుల్ ఐటీ లో ప్రవేశం అంటే మంచి విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇది గిరిజన విద్యార్థులకు మంచి అవకాశం అని ఆయన పేర్కొంటూ ఈ విజయం గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ముందడుగు అన్నారు. విద్యార్థి సంపత్ కుమార్ వెల్దుర్తి మండలం పాపిరెడ్డి కుంట తండాకు చెందినవాడు కాగా తల్లిదండ్రులు మల్లికార్జున నాయక్, బుజ్జిబాయిలు వ్యవసాయ కూలీలు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి ఇంత గొప్ప విజయం సాధించి తమ పాఠశాలకు ప్రతిష్ఠ తీసుకురావడం తమకెంతో గర్వకారణం అని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పేర్కొంటూ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

### వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్): ప్రభుత్వం ఆదేశాల మేరకు రెడ్డివారి పల్లి మరియు గుంజువారి పల్లి గ్రామాలలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వేరుశనగ మొక్కజొన్న వరి వివిధ పంటలలో వాడవలసిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు చీడపీడల నివారణ చర్యల గురించి



తెలియజేయడం జరిగింది వేసవి దుక్కుల వలన కలిగే ప్రయోజనాలు మరియు వేరుశనగలో విత్తన శుద్ధి కొరకు ఇమడా క్లోప్రైడ్ మందును ఒక ఎం ఎల్ కేజీ విత్తనానికి కలిపి వాడుకోవాలి మరియు డైతేన్ ఎం 45 మూడు గ్రాములు ఒక కిలో విత్తనాన్ని కలిపి వాడుకోవాలని తెలియజేయడం జరిగింది వేరుశనగలో పూత దశలో ఎకరాకు నాలుగు మూటలు అనగా 200 కిలోల జిప్సం వాడకం వలన కాయ కాయ గట్టితనం మరియు నూనె శాతం పెరుగుతుందని తెలియజేశాము మొక్కజొన్న లో మామూలుగా వచ్చి కత్తెర పురుగు నివారణ చర్యలు గురించి తెలియజేయడం జరిగింది ఉద్యాన శాఖ వారు ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు స్టేట్ నెట్లో పాక్ హౌస్ల గురించిన వివరాలు వాటి సబ్సిడీ వివరాలు తెలియజేశారు కావలసిన రైతులు హార్టికల్చర్ వారిని సంప్రదించాలని తెలియజేయడం జరిగింది టమాటోలో నూతన సాగు విధానాలు మరియు పంటలలో ఆశించే చీడపీడల నివారణ చర్యలను హార్టికల్చర్ ఆఫీసర్ లావణ్య తెలియజేశారు.కౌలు రైతులకు సిసిఆర్సి కార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశాము పంట సాగులో మందులు పిచికా మందులు పిచికారి కొరకు డ్రోన్ వాడకము ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వివరాలు గురించి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏవో భారతి హెచ్ ఓ లావణ్య ఏఈఓ ప్రశాంతి వి హెచ్ఏ భార్గవి రైతుల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :24.06.2025 న దోర్నాల మండలం లోని యడవల్లి మరియు గంటవాని పల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పోలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన ప్రత్తి, బత్తాయి మరియు కూరగాయలు పంటలను సందర్శించి రైతులకు యాజమాన్య పద్ధతులు గురించి, సూక్ష్మ పోసకాల లోపల గురించి అవగాహనా కల్పించడం జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న భూసారా పరిరక్షణ పథకం, అన్నదాత సుఖీభావ-, ప్రధాన మంత్రి పసల్ భీమా పథకం, కౌలు రైతులకు కార్డులు పొందే విధానం కార్డుల వలన ఉపయోగాలు గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగే పథకం కింద రైతులకు కిట్స్ పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో చైతన్య కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## పాఠశాలను అభివృద్ధి పరిచి ప్రజాప్రయోజనాల కోసం వినియోగించండి

### జనసేన పార్టీ నాయకులు లక్ష్మణ కుటాల



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్): కదిరి పట్టణంలో శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి అతి సమీపంలో కదిరి నుంచి హిందూపురం దారిలో పురపాలక సంఘం ఉన్నత పాఠశాల శిధిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాల శిధిలావస్థకు చేరుకున్న సందర్భంగా కొద్దిమంది మందు బాబులు మద్యం సేవించడం , గుట్కా నమిలి ఉంచడం ఇటువంటి అసాంఘీక కార్యక్రమాల జరుగుతున్నాయని,ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉన్నత పాఠశాల నేడు దీన స్థితిలో శిథిలావస్థకు చేరుకుందని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు ఆ ఉన్నత పురపాలక సంఘం పాఠశాల గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు ఆదరణ లేక శిధిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ప్రజలకు మంచి చేసే ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, స్థానిక శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్న అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్య పట్ల స్పందించి మునిసిపల్ కమిషనర్ ఆ పురపాలక సంఘం ఉన్నత పాఠశాల సమస్యను కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకొని వెళ్లి శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం కోసం వచ్చే శ్రీ వారి భక్తులకు స్నానపు గదులు,లాకర్ రూమ్స్ సౌకర్యం లేదా పురపాలక సంఘం ప్రజా ప్రయోజనాల కోసం అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తారని కదిరి పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.



## పట్టు వదలని టీడీపీ నాయకులు తెగిన రోడ్ కు సొంత నిధులతో 10వ సారి మరమ్మతులు..అభినందిస్తున్న స్థానిక ప్రజలు..



కనేకల్, మండల విలేకరి - మాల్యం కిరణ్ కుమార్ జూన్ 25 (శుభోదయం న్యూస్): కణేకల్ టీడీపీ నాయకులు వేదవతి హగిరిలో ఉన్న రోడ్ విషయంలో పట్టువదలకుండా 10 వ సారి సొంతనిధులతో రోడ్ కు మరమ్మత్తు పనులు చేసి అందరి చేత శబాష్ అనిపించుకొన్నారు.. హెచ్ ఎల్ సి కాలువ పైన రోడ్ బంద్ అయినప్పటి నుండీ వాహన రాక పోకలు స్థానిక వేదవతి లో కొనసాగుతున్నాయి.. కాని గత ఏడాది నుండీ వర్షం వచ్చిన ప్రతి సారి వేదవతి హగిరి పొంగి పార్లి రోడ్ కొట్టుకుపోవడం జరుగుతు వస్తుంది.. దింతో స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్రాజులు, రమేష్, చంద్రశేఖర్గుప్తా,కురుబ నాగరాజు, చాంద్ బాషా ఆధ్వర్యంలో సొంత నిధులుతో ఇప్పటికి దాదాపు 10 సార్లు రోడ్ వేసి అందరి చేత శబాష్ అనిపించుకొంటున్నారు.. మంగళవారం కూడా తాజాగా తెగిన రోడ్ కు మట్టి వేసి రోడ్ ను మరమ్మాతులు చేసి రోడ్ మార్గాన్ని సుగమానం చేసారు.

## రైతులకు అందించే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి వ్యవసాయ శాఖ అధికారి సంగమేశ్వర రెడ్డి



త్రిపురాంతకం మండల రిపోర్టర్ - గుత్తా చిన్న మూర్తయ్య (శుభోదయం న్యూస్): త్రిపురాంతకం మండలంలోని ముడివేముల మరియు ఉమ్మడివరం గ్రామాలలో మంగళవారం నాడు మండల వ్యవసాయ అధికారురి అయినటువంటి బి.సంగమేశ్వర్ రెడ్డి గారి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి. సంగమేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డును తప్పనిసరిగా చెప్పించుకోవాలని, దానికి యజమాని యొక్క ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్కు మరియు కౌలు దారుని యొక్క ఆధార్ కార్డును తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులు వద్దకు వచ్చి అప్లై చేసుకోవాలని మరియు ప్రధానమైన పంటలు వేసే ముందు తప్పనిసరిగా పచ్చి రొట్టె ఎరువులు వేసుకొని రసాయన ఎరువులు యొక్క వాడకాన్ని తగ్గించాలని, మట్టి పరీక్ష చేపించుకోవడం వలన భూమిలో ఉండే పోషక వివరాలను తెలుసుకోవచ్చని, తద్వారా పంటలను వేసుకొని అధిక దిగుబడి వచ్చే విధంగా రైతులు ఆలోచించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, పంటల భీమా యొక్క ఆవశ్యకతను ప్రాముఖ్యతను రైతులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి లక్ష్మణ్ నాయక్, యోగి రెడ్డి, మంత్రు నాయక్ మరియు రైతు సోదరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది.



## శ్రీకాళహస్తి కరుణీక సంఘం చే విలేకరి కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీకాళహస్తి ,రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): శ్రీకాళహస్తి పట్టణంలో ఇటీవల స్వర్గస్తులైన వార్త విలేఖరి, మెహర్ కుమార్ కుటుంబానికి శ్రీకాళహస్తి కి చెందిన కరుణీక సంఘం ఆధ్వర్యంలో తమవంతు సాయంగా 5000రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో మెహర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి తల్లిగారికి శ్రీకాళహస్తి కరుణీక సంఘం తరపున ఆర్థిక సహాయం చేయడమైనది. ఈకార్యక్రమంలో సంఘం నేతలు ఎ.పాండురంగం ,కె.ఉమాశంకర్ ,పి.ఎస్.సూర్యప్రకాష్ లు పాల్గొన్నారు.

## బాలాజీ రెడ్డి జన్మదినం సందర్భంగా అమ్మ ఆశ్రమంలో అన్నదానం



తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాళెంకు చెందిన ఆదూరి బాలాజీరెడ్డి జన్మదినం పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి ఆదేశాల మేరకు సాంబయ్యపాలెం భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శివనాధపురం వద్ద గల అమ్మ ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆదూరి బాలాజీ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఈ సందర్భంగా వారు కోరుకున్నారు. కాగా అన్నదానం చేయించిన కలవగుంట భరత్ రెడ్డిని అమ్మఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమంలో ఉన్న వారు అభినందించడంతో పాటు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భారత్ యువసేన సభ్యులు ,బాలాజీ రెడ్డి కుటుంబ సభ్యులు మిత్రబృందం పాల్గొన్నారు..

## బీసీ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్.. 16 మంది విద్యార్థులకు అస్వస్థత



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): శ్రీకాళహస్తి పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ లో మంగళవారం 16 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురైనారు. వీరిని శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి,కూటమి నాయకులు పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని



ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి డాక్టర్లకు ఆదేశించారు, ఆయన మాట్లాడుతూ..శ్రీకాళహస్తిలో బీసీ బాలుర హాస్టల్ లో 16 మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం తినడంతో ఫుడ్ పాయిజన్ అయిందని ,విద్యార్థులు ఎవరికి ఎటువంటి విషమ పరిస్థితి లేదని విద్యార్థులందరూ బాగానే ఉన్నారని అన్నారు, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, వారిని క్షేమంగా హాస్టల్ కు పంపిస్తామని ఆయన తెలియజేశారు, హాస్టల్ వార్డెన్ పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవోతో పాటు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు రావిళ్ళ ముని రాజా నాయుడు ఉన్నారు.

## మా బడి మాకు కావాలి శివనాధపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): తొట్టంబేడు మండలంలోని శివనాధపురం గ్రామం ప్రాథమిక పాఠశాలను రామచంద్రపురం గ్రామానికి మారుస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు,ఈ విషయమై పిల్లలు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,శివనాధపురం నుంచి రామచంద్రపురం గ్రామానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉందని పిల్లలు వచ్చి వెళ్లడానికి కష్టతరమవుతుందని మా బడి మాకు కావాల్సిందేనని విద్యార్థులు వారి తల్లిదండ్రులు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధి దిశలో దూసుకుపోతుంది



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 25 (శుభోదయం న్యూస్) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధి దిశలో దూసుకుపోతుందని బిజెపి నాయకులు అన్నారు సోమవారంభారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాత గుంతకల్ ఏడవ వార్డులో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వికసిత భారతదేశపు అమృతకాలం సేవ, సుపరిపాలన, పేదలక్షం క్షేమానికి 11 సంవత్సరాలు గల కరపత్రాలు ఇంటింటికి సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ వివరిస్తూకరపత్రాలు పంచడం జరిగింది గత 70 సంవత్సరాలు పరిపాలన చేసినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దేశాన్ని అభివృద్ధిలో , శూన్యం కుంటపడడం బ్యాంకింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మార్చడం బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందకపోవడం దేశ రక్షణ వ్యవస్థలకుంటపడడం ఇలా అనేక సమస్యలతో కుటుంబ పరిపాలనతో సాగించి ఈ దేశాన్ని అభివృద్ధిలోకం తప్పడం జరిగింది ఎక్కడ చూసినా అవినీతి క్రమాలకు పాల్పడి దేశ అభివృద్ధిలో శూన్యం భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటిదాకా అభివృద్ధిలో ప్రపంచ ఆర్థిక రంగంలో 2014 లో 10వ స్థానంలో ఉన్నటువంటిది 2025 లో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది ఇలా అనేక సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు నారి శక్తి మహిళలకు మధ్యతరగతి వారి జీవితాన్ని సులభం చేయడం కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినారు ఈ దేశంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్అన్న యోజన పథకం ద్వారా దేశంలో 81 కోట్లకు పైగా రాష్ట్రంలో 2.68 కోట్లు పైగా లబ్ధిదారులకు ఉచిత బియ్యం అందుతున్నాయి ఈ దేశంలో ఎవరో కూడా ఆకలితో పస్తులు ఉండకూడదు అని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా దేశంలో నాలుగు కోట్లకు పైగా ఇల్లు నిర్మాణం చేపట్టాయి రాష్ట్రంలో 23.5 లక్షల ఇల్లు మంజూరు చేయబడ్డాయి నారీ శక్తి కి మరింత ప్రోత్సాహం పార్లమెంట్ మరియు అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు ప్రస్తుత సెలవులు 12 వారాల నుండి 26 వారాలకు పెంచారు ట్రిపుల్ తలాక్ రద్దు చట్టం ముస్లిం మహిళలకు న్యాయం చేసింది కోవిడ్ లాక్ డౌన్ సమయంలో దేశంలో 20 కోట్లు పైగా మహిళలు రాష్ట్రంలో 30 లక్షలకు పైగా మహిళల ప్రత్యక్ష నగదు సాయం పొందారు ఇలా అనేక సంక్షేమ పథకాలు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టారు 2047 వికసిప్ భారత్ సంకల్ప తో భారతదేశం ప్రపంచ దేశాల ముందర అగ్రస్థానంలో నిలిపెట్టేందుకు ఆర్థిక వ్యవస్థలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పరిపాలన అందిస్తున్నారు ప్రజలందరూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారు నరేంద్ర మోడీ గారు ఉంటేనే దేశం బాగుంటుంది దేశంలో ఉండే ప్రజలందరూ సురక్షితంగా ఉంటారని ప్రజలందరూ భావిస్తున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పట్టిన అధ్యక్షుడు వడ్డే రమేష్ కిసాన్ మచ్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుర్రం సూర్యనారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకట్ రాఘవ పట్టణ ఉపాధ్యక్షుడు శివశంకర్ వడ్డే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శ్రీకారం



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 25 (శుభోదయం న్యూస్): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం అభివృద్ధి పనులకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు ఆలయమునకు సమీపంలో గల సర్వే నంబర్ 183, 184 లో గల ఉన్న ఎ 5-75 సెంట్లు విస్తీర్ణం తో దేవస్థానమునకు చెందిన భూమి ఉంది..అందులో దాదాపు ఎ 3 -00 లలో గోవులకు పచ్చిగడ్డి పెంచుట జరిగినది, తక్కిన ఎ 2-75 సెంట్ల భూమిలో రాళ్ళ గుట్టలతో పెద్ద పెద్ద ముళ్లకంప చెట్లతో వనం అయిపోయినది, అలాంటి భూమిని శ్ కె. వాణి, కార్యనిర్వాహణాధికారి/ ఉప కమీషనర్ ఓంకారం వెంకటేశ్వరుడు, సహాయ కార్యనిర్వాహణాధికారి రెండు జేసీబీల ద్వారా శుభ్రం చేయుట జరుగుచున్నది.

## అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించిన వైసీపీ నాయకులు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): శ్రీకాళహస్తి బీసీ బాలుర హాస్టల్లో 16 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురయ్యారు.మంగళవారం యథావిధిగా హాస్టల్లో టిఫిన్ చేసి పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు, వీరిని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, వైయస్సార్సీపి బీసీ నాయకుడు వడ్ల తాంగల్ బాలాజీ రెడ్డి చిన్నారులను పరామర్శించినారు. అనంతరం అక్కడే విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను చిన్నారులకు అందిస్తున్న చికిత్సను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలోని బీసీ హాస్టల్ పిల్లలకు ఫుడ్ పాయిజన్ కావడంతో 16 మంది హాస్పిటల్ చేర్చడం జరిగింది అయితే అదృష్టవశాత్తు పిల్లలకు అందరికీ కూడా ఎటువంటి ఇబ్బంది రాకుండా వెంటనే డాక్టర్స్ అందరూ కూడా సమన్వయం చేసుకున్నారు కాబట్టి ఎటువంటి ప్రమాదం జరగలేదు డాక్టర్లకు



అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేశారు. అయితే వచ్చిన హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని,ఉదయం అల్పాహారం అందించే ఇడ్లీ పిండిని పరిశీలించకుండా చిన్నారులకు అందజేశారు హాస్టల్ వార్డెన్ ప్రతిరోజు పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలచిన తర్వాతనే అందజేయాలి. హాస్టల్ వార్డెన్ పై వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన గురించి స్పందించిన డిఎంహెచ్వో కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి పెట్టాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వైయస్సార్సీపి యువజన సంఘం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి బాలిశెట్టి విజయ్ శేఖర్, పెరుమాళ్ చౌదరి, విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతు భరోసా సంబరాలు




అనంతగిరి, జూన్ 24 శుభోదయం న్యూస్: అనంతగిరి మండల కేంద్రాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు విజయోత్సవ సంబరాలు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొనడం జరిగింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద నిధులు రైతుల ఖాతాలో విడుదల చేసిన శుభ సందర్భన్నీ పురస్కరించుకుని మండలంలోని రైతులు మరియు పార్టీ నాయకులు ఏఐసీసీ అధ్యక్షులు మల్లి కార్జున్ ఖర్గే కి సోనియాగాంధీ గాంధీ కి, రాహుల్ గాంధీ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కి, రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి కి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రైతులందరు ప్రజా ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేవలం18 నేలలో రైతు రుణమాఫీ రైతు భరోసా రైతు బోనస్లు అందించిన ఏకైక ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని వారు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు దేగా కొండయ్య, అనంతగిరి మాజీ ఎంపిటిసి ఈదుల కృష్ణయ్య, గొండ్రియల మాజీ పిఏసిఎస్ చైర్మన్ బుర్ర నరసింహారెడ్డి, మండల కార్యదర్శి గద్దె రామారావు, పాలవరం గ్రామ శాఖ రామకోటయ్య గౌడ్, కానాపురం గ్రామ శాఖ కనకాల వీరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాజీవ్ నాయక్, కొత్త గోల్ తండా గ్రామ శాఖ బానోతు వేణు, కత్రం నాగేందర్ రెడ్డి, మందపల్లి వెంకటేశ్వర్లు, భూక్య నారాయణ, సుక్య నాయక్, వెంకటేశ్వర్లు, హరిబాబు మరియు వివిధ హోదాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# పునర్విభజనపై పునరాలోచన

## (విశ్లేషణ)

భారత దేశం అనేక సంస్కృతులు, భాషలు, మతాలు కలిపిన మిశ్రమ దేశం. 'భారత దేశం అంతా ఒక్కటిగా ఉంటుంది' అనే భావన ప్రాచీన కాలం నుంచీ కొనసాగుతున్నది. మన దేశం గొప్పదని, కశ్మీర్ టూ కన్యాకుమారి (ఉత్తరాన్నించి దక్షిణం వరకు) ప్రతి భారతీయుడు ఒక్కటిగా ఉంటారని గర్వంగా చెప్పుకుంటాడు. భరతమాత ముద్దు బిడ్డలమని ప్రతి ఒక్కరూ గౌరవంగా భావిస్తారు. ఇది భారతదేశంలోని అంతర రాష్ట్ర అనుబంధాన్ని, సామరస్యాన్ని చాటుతుంది. కానీ రాజకీయాలు ఈ అందమైన భావనకు ప్రతికూలంగా మారుతున్నాయా? అని చర్చ జరుగుతోంది. భారత్‌లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య క్రమంగా పెరిగిపోతున్న వివక్ష, రాజకీయ వర్గాల మధ్య అసమానతలు, సామాజిక శక్తి సామరస్యాన్ని భంగం చేయడంలో ఎంతగానో పాత్ర పోషిస్తున్నాయి. 8 దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత, ఎక్కువ మంది ఉత్తరాదివారు ప్రధాని పదవిని ఎప్పటికప్పుడు ఆక్రమించుకున్నారు. కానీ దక్షిణాది ప్రాంతం నుండి మాత్రం పివి నరసింహారావు, దేవెగౌడ వంటి ఇద్దరు ప్రధానులు మాత్రమే వచ్చిన సంగతి మనకు తెలుసు. భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టబోతున్నారు. ఈ ప్రక్రియ 2026లో అమలవుతుంది.ఇందులో పార్లమెంట్ సీట్ల సంఖ్య పెరిగిపోతుంది. అయితే, ఈ సీట్లు పెరిగేటప్పుడు దక్షిణాదికి తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని మేధావులు, ప్రజాస్వామ్యప్రియులు భావిస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ప్రాతిపదికన చేపట్టబడుతోంది. దీనితో దక్షిణాది రాష్ట్రాలకు కొత్త ఎంపి సీట్లు సాధించడంలో కఠినతరం అవుతుందని చెప్పబడుతోంది.డీలిమిటేషన్ ప్రక్రియలో కొత్త ఎంపి సీట్లు జనాభా ప్రాతిపదికన కేటాయించబడతాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించడంలో ముందంజలో ఉన్నాయి. వీటిలో మౌలిక విధానాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో అధిక మెరుగుదలతో, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎంతో ముందుంది.కానీ, ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఆధారంగా, దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు లభించకపోవడం, అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలలో సీట్లు పెరిగిపోవడం ప్రతికూలతలను సృష్టిస్తుంది.ప్రస్తుత డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా పార్లమెంట్ సీట్ల కేటాయింపును తిరిగి ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రక్రియను ముందే అంచనా వేసి, రెండు సంవత్సరాల క్రితం బిజెపి పాలకులు పార్లమెంట్ కొత్తభవనం నిర్మాణం ప్రారంభించారు. ఇందులో మొత్తం 888 సీట్ల పరిమాణం తో కొత్త భవనం నిర్మాణం చేపడుతూ పార్టీ తమ రాజకీయ లౌక్యాన్ని ప్రదర్శించడంలో పాల్గొన్నారని భావిస్తున్నారు.ఇది పలు ప్రశ్నల్ని కలిగిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పార్లమెంట్‌లో మొత్తం 547 సీట్ల స్థానంలో 846 సీట్లు ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం జాతీయ రాజకీయ వ్యవస్థలో కాంట్రవర్సీని కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు భారీ సంఖ్య లో సీట్లు పొందబోతున్నాయి. ఉదాహరణకు ఉత్తరప్రదేశుకు 80 నుంచి 122 సీట్లు, బీహార్‌కు 40 నుంచి 70 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల చాలా తక్కువగా ఉంటుందని అంచనా.తెలంగాణకు 17 -20, ఆంధ్రప్రదేశుకు 25 -28, తమిళనాడుకు 39- 41, కేరళకు 20- 19 సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ పరిణామంలో, ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం పెరిగిపోతుండగా, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగడం మొదలవుతుంది. ఈ పరిస్థితి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ శక్తిని పెంచి, దక్షిణాది రాష్ట్రాల శక్తిని బలహీనపరుస్తుంది. ఇది శాశ్వతంగా ఉత్తరాది ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యవాదులు ఈ పరిణామాన్ని అంగీకరించలేకపోతున్నారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు, దీనిని వాయిదా వేసింది. ఆమె భావన ప్రకారం, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. ఇక్కడ జనాభా నియంత్రణకు కీలకమైన నిర్ణయాలు తీసుకున్న కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉండటంతో, ఈ విధానం అమలుచేస్తే వారి గాయాలు మరింత పెరిగిపోతాయని ఆమె అంగీకరించారు. 2001లో ప్రధానిగా ఉన్న అటల్ బిహారి వాజ్‌పేయి కూడా దీనికి ఇలాగే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన కూడా ఈ డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేందుకు ప్రయత్నించారు. ఆయన అభిప్రాయ ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు అనేక రంగాలలో అభివృద్ధిని సాధించడంతో, డీలిమిటేషన్ ప్రక్రియను వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్యాయం చేయకుండా నిర్వహించాల్సిన అవసరం ఉంది. 2026లో జరగబోయే డీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయడం అనేది పెద్ద చర్చకు దారితీస్తుంది. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగితే వారి రాజకీయశక్తి పెరుగుతుంది. కానీ దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గడంతో వారి ప్రభావం తగ్గిపోతుంది. ప్రజాస్వామ్యవాదులు ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచి, ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే అధిక శక్తి ఇవ్వడం వల్ల రాజకీయ సమతుల్యతకు ముప్పు అని అంటున్నారు. తమిళనాడుకు సీట్లు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డీలిమిటేషన్ ద్వారా ఒక్క సీటు కూడా తగ్గబోదని చెప్పారు. కానీ, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ అమలు చేస్తే తమిళనాడుకు మరింత సీట్లు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోందిడీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది ప్రాంతం దక్షిణాది మీద శాశ్వత ఆధిపత్యం ఏర్పడుతుందని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల ఓట్లు, సీట్లు పెరిగితే, దక్షిణాది రాష్ట్రాల ప్రభావం తగ్గి, దేశం ఏకపక్షంగా ఒకే పార్టీ ఆధీనంలో ఉండేలా మారవచ్చని విశ్లేషిస్తున్నారు. కొంత మంది బిజెపి హిందీ బెల్ట్‌లో పట్టు పెంచుకుంటుందని కూడా అభిప్రాయపడుతున్నారు. జనాభా ఆధారంగా జరిగిన డీలిమిటేషన్, బిజెపికి లాభం చేకూర్చే అవకాశం కల్పిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయింపుతో బిజెపి ఒకే పార్టీగా ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక శక్తిని పొందవచ్చు. దీని వల్ల దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడం సులభమవుతుంది. ఇది భారతదేశ రాజకీయ వ్యవస్థలో పెద్ద మార్పును సూచిస్తుంది.ఈ డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే, వాటి రాజకీయ శక్తి తగ్గిపోతుంది. దక్షిణాది రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్ర పోరాటం చేయాలి, ప్రజల్లో చైతన్యం పెరిగి, సమర్థవంతమైన ప్రతిస్పందన ఇవ్వడం అవసరం. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటానికి కీలకమై ఉంటుంది. భారత దేశంలో రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సమతుల్యతపై డీలిమిటేషన్ ప్రక్రియ అనేక ప్రశ్నలను తెస్తోంది. ఈ ప్రక్రియ అమలులోకి వచ్చినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు మరింత బలహీనంగా మారే అవకాశం ఉంది. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు అధిక శక్తిని పొందవచ్చు. దీనివల్ల భారత దేశంలో ఒక కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పడే అవకాశముంది. డీలిమిటేషన్ ప్రక్రియ భవిష్యత్తులో ఉత్తరాది- దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను భారీగా ప్రభావితం చేసే అవకాశం కలిగినది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించే దిశగా పని చేస్తుంది. ఈ పరిణామాల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుంది. కనుక అవి ఈ అంశంపై తీవ్రం గా ఉద్యమించి, ప్రజలలో చైతన్యాన్ని పెంచుకోవడం అత్యంత అవసరమైంది.

# నీటి చుక్క కాదు నిప్పురవ్వ..
# తెలుగు రాష్ట్రాల మధ్య వాటర్ ఫైర్..!



బనకచర్ల ఒక గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్.. అందులో నో డౌట్. గోదావరి నీటిని గనక సరిగ్గా ఉపయోగించుకుంటే సీమ ఎడారిలోనూ పంటలు పండిచొచ్చు. అందుకే.. తెలంగాణలో గానీ, ఏపీలో గానీ ప్రధాన ప్రాజెక్టులన్నీ గోదావరి మీదే ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం బ్యారేజ్, సుందిళ్ల బ్యారేజ్ కట్టారు. ఏపీలో పోలవరం కడుతున్నారు. అసలు తెలుగు రాష్ట్రాలకు ఆధారమే గోదావరి. కృష్ణా నదిపై పైరాష్ట్రాల వాళ్లు బోలెడు ప్రాజెక్టులు కట్టుకున్నారు. పైన ప్రాజెక్టులు నిండిన తరువాతే.. తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నీళ్లొస్తాయి. అందుకే, వర్షాకాలంలో గోదావరి వరద పోటెత్తి ప్రాజెక్టులు నిండుతాయి గానీ కృష్ణమ్మ పొంగడం



చాలా తక్కువ. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా తక్కువే అనిపిస్తుంది ఆ వరద చూస్తే, ఏడాదికి కనీసం 3వేల నుంచి 4వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలు అవుతున్నాయి. 3వేల టీఎంసీల నీళ్లు సంద్రంలో కలపడం కంటే.. అందులో 10 శాతం వాడినా కరువు పోతుంది. ఆ ప్రయత్నమే బనకచర్ల.

ముందుగా గోదావరి నీటి ప్రవాహ తీరును చూద్దాం.

మహారాష్ట్రలో పుట్టిన గోదావరి తెలంగాణలోని బాసర, మంథని, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్తుంది. ఒక్కసారి భద్రాచలం దాటిన తరువాత.. ఇక ఆ నీరంతా పట్టిసీమ, రాజమండ్రి, అంతర్వేది మీదుగా సముద్రంలో కలుస్తుంది. అటు తెలంగాణలో శ్రీరాంసాగర్, శ్రీపాదసాగర్, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నాయి. కాని, ఏపీలో గోదావరిపై ధవళేశ్వరం మాత్రమే ప్రధాన ప్రాజెక్ట్. ప్రస్తుతం పోలవరం నిర్మిస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లో గోదావరి ప్రవాహ తీరు

కాని, ఎవరెన్ని ప్రాజెక్టులు కట్టినా.. ప్రతి ఏడాది కనీసం 3వేల టీఎంసీల గోదావరి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. అందులో 10 శాతం.. అంటే 300 టీఎంసీలు చాలు అంటోంది ఆంధ్రప్రదేశ్. పైగా.. ఇది నదుల అనుసంధాన ప్రాజెక్ట్ కూడా. బనకచర్ల ప్రాజెక్ట్ అనేది గోదావరి-కృష్ణా నదులను కలుపుతుంది. అంతేకాదు.. బనకచర్ల నీళ్లు పెన్నా నదిలోకి కలుస్తాయి. దీంతో దక్షిణ భారతదేశంలో నదుల అనుసంధానానికి అతిపెద్ద పునాది పడినట్టే..! ఇప్పటి వరకు పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి నీళ్లను కృష్ణాలో కలుపుతున్నారు. గోదావరికి వరద వచ్చే సమయంలో ఒక్కోసారి కృష్ణమ్మ ఖాళీ అవుతుంది. ఆ సమయంలో పట్టిసీమ నీటిని లిఫ్ట్ చేసి కృష్ణా పరివాహకంలోని పంటలకు సాగునీరు ఇస్తున్నారు. పోలవరం పూర్తయితే.. ఇక పట్టిసీమ అవసరం లేకుండానే గోదావరి నీటిని కృష్ణాలోకి మళ్లించొచ్చు. షార్ట్‌గా చెప్పాలంటే.. అదే బనకచర్ల ప్రాజెక్ట్

బనకచర్ల ప్రాజెక్ట్ మొదటి దశ

ప్రస్తుతం పోలవరం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా గోదావరి నీటిని వైకుంఠపురం బ్యారేజ్‌లోకి పంపుతారు. ఈ వైకుంఠపురం బ్యారేజ్ ప్రకాశం బ్యారేజ్‌కి ఎగువన ఉంటుంది. అయితే.. పోలవరం నుంచి వైకుంఠపురానికి నీళ్లు తేవడానికి ప్రస్తుతం 17వేల 500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కెనాల్ ఉంది. కాని, ఇది సరిపోదు. అందుకే, దీన్ని 38వేల క్యూసెక్కులకు పెంచుతున్నారు. దీంతో పాటు తాడిపూడి ఎత్తిపోతల సామర్థ్యాన్ని కూడా పెంచుతారు. ప్రస్తుతం తాడిపూడి ఎత్తిపోతల కెపాసిటీ 1,400 క్యూసెక్కులు. దీన్ని 10వేల క్యూసెక్కులకు పెంచుతారు. దీనికోసం.. కొత్తగా 25వేల క్యూసెక్కుల కెపాసిటీతో పోలవరం కుడి కాలువకు సమాంతరంగా వరద కాలువ తవ్వుతారు. అటు పోలవరం కుడి కాలువ, దానికి సమాంతరంగా తవ్వుతున్న మరో కొత్త కాలువ ద్వారా వైకుంఠపురం బ్యారేజ్‌కి నీళ్లు తీసుకెళ్తారు. అంటే.. గోదావరి ఎర్రనీరు.. కృష్ణాలోని నల్లనీళ్లకు సంగమం జరుగుతుంది.

ఇక రెండో దశ..

ఈ వైకుంఠపురం బ్యారేజ్ అనేది.. ఎగువన పులిచింతల, దిగువన ప్రకాశం బ్యారేజీకి మధ్యన ఉంటుంది. వైకుంఠపురంలో నీళ్లని నిల్వ చేయడానికంటే ముందు.. మరో పని ఇక్కడే జరుగుతుంది. నాగార్జున సాగర్ కుడి కాలువ ఆల్రెడీ ఉంది. ఈ కుడి కాలువ ప్రవహిస్తున్న దారిలో సరిగ్గా 80వ కిలో మీటర్ దగ్గర ఆ కెనాల్ కెపాసిటీని పెంచుతారు. 96.5 కిలోమీటర్ల వరకు.. అంటే 16.5 కిలోమీటర్ల పొడవున.. నాగార్జున సాగర్ కెనాల్ సామర్థ్యాన్ని పెంచుతారు. నిజం చెప్పాలంటే.. అదే ఒక పెద్ద రిజర్వాయర్‌లా కనిపిస్తుంది. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. బొల్లాపల్లిలో ఏకంగా 150 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా రిజర్వాయర్ కట్టబోతున్నారు.

ఇక మూడో దశ..

బొల్లాపల్లిలో నీటిని స్టోర్ చేసి.. ఆ నీటిని బనకచర్ల రెగ్యులేటర్‌కు పంపిస్తారు. అయితే.. బొల్లాపల్లి, బనకచర్ల మధ్య నల్లమల అడవులు ఉన్నాయి. కొండ ప్రాంతం. అందుకే, ఏకంగా 23 కిలోమీటర్ల పొడవున సొరంగం తవ్వాల్సి ఉంటుంది. పోలవరం ప్రాజెక్ట్ రైట్ బ్యాంక్ కెనాల్ ద్వారా వైకుంఠపురానికి, అక్కడి నుంచి లిఫ్ట్‌ల ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తరలిస్తారు. ఇందుకోసం ఏకంగా 80వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నారు. ఆల్‌మోస్ట్ కాళేశ్వరం ప్రాజెక్ట్ సైజ్ ఇది. ఈ నీళ్లన్నీ ఎప్పుడు తరలిస్తారంటే.. కేవలం వర్షాకాలం ఉన్నప్పుడే. ఒక రకంగా ఇవి వృథా జలాలే. సముద్రంలో కలిసే నీటిలో ఓ 10 శాతాన్ని ఉపయోగించుకుంటున్నారు. బనకచర్ల ద్వారా కరువు ప్రాంతాలైన పల్నాడు, రాయలసీమ, వెలుగొండ, ప్రకాశం జిల్లాలకు నీరు అందుతాయి. కృష్ణా నదిలో తగినంత నీరు లేకపోయినా ఆ ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయి. అందుకే, దీన్ని గేమ్‌ఛేంజర్ ప్రాజెక్ట్ అంటున్నారు సీఎం చంద్రబాబు.

తెలంగాణ అభ్యంతరం ఏంటి?

తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన గోదావరి నీళ్లు 1,486 టీఎంసీలు. అంతకు మించి వాడుకునే హక్కులు ఎవరికీ లేవు. కాని, సముద్రంలో కలిసే నీళ్లు అంటూ 200 టీఎంసీలు తీసుకెళ్తోంది ఏపీ. రేపొద్దున గోదావరిలో నీళ్లు తగ్గినా.. కృష్ణాలో నీటిని ఈ లిఫ్టుల ద్వారా తరలిస్తారనేది తెలంగాణ భయం. ఏపీలో బనకచర్ల నిర్మిస్తామని చెప్పగానే తెలంగాణ అభ్యంతరం చెబుతోంది గానీ.. నిజానికి ఇది కొత్త ప్రాజెక్ట్ కాదు. వైఎస్ జగన్ ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని మాజీ మంత్రి అంబటి రాంబాబు చెబుతున్నారు. 2022లో ప్రాజెక్ట్‌కు ప్రతిపాదనలను సీడబ్ల్యూసీకి పంపామని క్లెయిమ్ చేసుకుంటోంది వైసీపీ. బనకచర్లతో.. పల్నాడు, రాయలసీమ, వెలిగొండ, ప్రకాశం జిల్లాల సాగునీటి కష్టాలు తీరతాయని చెబుతోంది.

అందులోనూ ఒక రూల్..

నది ప్రవహిస్తున్న రాష్ట్రాల్లో చిట్టచివరి రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక హక్కులు ఉంటాయి. సముద్రంలో కలిసిపోయే నీటిని చివరి రాష్ట్రం వాడుకోవచ్చు. ఈ ప్రత్యేక వెసులుబాటు ఎందుకంటే.. గోదావరి నదిపై మహారాష్ట్ర బోలెడు ప్రాజెక్టులు కట్టింది. ఇటు తెలంగాణలోనూ చాలా ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ ప్రాజెక్టులన్నీ నిండిన తరువాతనే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వస్తాయి. అందుకే, ఆ ప్రత్యేక హక్కులు. చంద్రబాబు వాదన కూడా ఇదే. సముద్రంలోకి పంపే బదులు ఆ నీటిని వాడుకునే ప్రయత్నం చేస్తున్నాం.. అందులో తప్పేంటి అంటున్నారు.కాని, తెలంగాణ ఊరుకోవడం లేదు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే నీళ్లు, నిధులు, నియామకాలు అనే స్లోగన్ నుంచి. ఇప్పుడు నీళ్ల విషయంలో అన్యాయం జరుగుతోందంటే.. తెలంగాణ ఊరుకోకపోవచ్చు. మరి.. ఈ నీళ్ల జగడాన్ని ఎలా తీర్చుకుంటారో చూడాలి. ఎన్డీయేలో భాగస్వామి కాబట్టి చంద్రబాబు మాట నెగ్గుతుందా..? బీజేపీకి తెలంగాణలో అధికారం ముఖ్యం కాబట్టి చంద్రబాబును ఆపుతారా అనేది చూడాలి..!

# సవాళ్ల మధ్య సాగేనా అభివృద్ధి?

భారత్‌కు స్వాతంత్ర్యం లభించి 2047 కు వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలంటే రాష్ట్రాలు, కేంద్రం పరస్పర అవగాహన సమన్వయంతో వ్యవహరిస్తేనే లక్ష్యాలను సాధించగలం. ఆంధ్రప్రదేశ్‌కు 972 కి.మీ విస్తారమైన సముద్ర తీరం ఉండటం ఓ వరం. మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తూ, భారత ప్రభుత్వ సాగరమాల పథకం కింద విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయంపేట, నిజాం పట్నం, కృష్ణపట్నం రేవులను ఇతోధికంగా అభివృద్ధి చేసి ఉత్పత్తి కేంద్రాలతో అనుసంధానించి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేయాలి. సోదర తెలుగు రాష్ట్రం తెలంగాణకు సముద్రతీరం లేనందున మచిలీపట్నం తదితర రేవులను తెలంగాణ సహకారంతో ఉభయ తారకంగా అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలి.

నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపేందుకు తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ. 3,22,359 కోట్ల బడ్జెట్ భారీగా కనిపిస్తున్నా అమలుకు అవసరమైన వనరుల కొరత వెన్నాడుతోంది. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత పాటిస్తూ ఎన్నికల హామీల అమలుకుప్రాధాన్యమిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో చెప్పినా రాష్ట్ర సొంత ఆదాయం అంతంత మాత్రంగానే ఉన్నందున, నిధుల సమీకరణకు చేసే ప్రయత్నాలు సఫలం కాకపోతే బాహుబలి బడ్జెట్ పూర్తిగా అమలు కావడం సందేహాస్పదమే. అప్పులు, వడ్డీలకే రూ. 60 వేల కోట్లు చెల్లించవలసి ఉంటుంది. కార్పొరేషన్ల రుణాలు అదనం. నరేంద్ర మోడీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ప్రభుత్వంకూడా గత 11 ఏళ్ళ ఏలుబడిలో ఎడాపెడా రుణాలు దూసి తెచ్చి అప్పుల భారతాన్ని మిగిల్చింది.

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ అప్పులపై ఆధారపడిన భారీ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ ప్రతిపాదనలు అమలు చేయాలంటే లక్ష కోట్లకు పైగా రుణాలు తీసుకోక తప్పదని అంచనా. ఆర్థిక మంత్రి ఈ అంశాన్ని చెప్పకనే చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి సాగించిన విధ్వంసం నుండి రాష్ట్రాన్ని గట్టెక్కించడం, పునర్నిర్మాణం కూటమికి కత్తిమీద సామేనని భావిస్తున్నారు. స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక పత్రంలో పేర్కొన్న లక్ష్యాల సాధనకు కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్ పునాది వంటిదే. 95 కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు నిలిపివేయడం వల్ల రూ. 40 వేల కోట్లు కోల్పోవలసి వచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు దీటుగా నిధులు కేటాయించకపోవడం, కేంద్ర నిధులను మళ్లించడం వల్ల నవ్యాంధ్రకు రావలసిన లబ్ధి చేకూరలేదు. మూలధన చెల్లింపులు రూ. 24,430 కోట్లు కాగా, మూలధన వసూళ్లు రూ. 1,04,382 కోట్లు. కాగా రెవెన్యూ వసూళ్లు రూ. 2,17,976 కోట్లు, చెల్లింపులు రూ. 2,51,162 కోట్లు. ద్రవ్యలోటు రూ. 79,926 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు. ఈ అంతరం ఆందోళన కలిగించేదే.

ఇప్పటికే భారీ రుణభారంతో తల్లడిల్లుతున్న ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అప్పులు తేవడం మరింత భారమే. అయినా రాజకీయ పార్టీలు ఎన్నికలలో గెలవడానికి పోటాపోటీగా అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేసి తీరవలసిందే. మార్కెట్ నుండి, ఆర్థిక సంస్థల నుండి భారీగా అప్పులు చేయక తప్పదు. ప్రతిపాదిత రూ. 40,635 కోట్ల మూలధన వ్యయం నిధుల కొరత దృష్ట్యా ఏ మేరకు సాధ్యమో వేచిచూడాల్సిందే. రాష్ట్రానికి కీలకమైన సేద్యపు రంగాన్ని రూ. 48,341 కోట్ల బడ్జెట్‌తో మెరుగుపరచాలని ప్రతిపాదించారు. జగన్ ప్రభుత్వం పట్టించుకోని బిందు, తుంపర సేద్యానికి కూటమి ప్రభుత్వం మళ్ళీ సబ్సిడీలను పునరుద్ధరించడం పూలు, పండ్ల తోటలు, ఇతర ఉద్యాన




పంటల అధికోత్పత్తికి, పండ్ల ఎగుమతులకు తోడ్పడగలదు. ఇటీవల అనంతపురం నుండి ప్రత్యేక రైలులో విదేశాలకు ముంబై ద్వారా అరటిపండ్లు ఎగుమతి చేశారు. సరైన అరటి మొక్కలు రాష్ట్రంలోనే రైతులకు సరఫరా చేస్తే పండ్ల ఉత్పత్తిని పెంచి ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యం ఆర్జనకు తోడ్పడగలరు.

కొన్ని హైదారాబాద్ కంపెనీలు వైరస్ సోకిన అరటి పిలకలను సరఫరా చేయడం వల్ల అరటి గెలలు కోతకు ముందే నేలకూలి రైతులు లక్షల్లో నష్టపోయారు. నకిలీ రోగగ్రస్థ మొక్కల కంపెనీలపై ఉద్యాన, వ్యవసాయ అధికారులు తగు నిఘా వుంచి అన్నదాతలను నష్టాల బారినుండి కాపాడాలి. బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ. 33,260 కోట్లు, వైద్య ఆరోగ్యశాఖలకు రూ. 19,265 కోట్లు, సాంఘిక సంక్షేమానికి రూ. 10,909 కోట్లు, రవాణా శాఖకు రూ. 8,785 కోట్లు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖలకు రూ. 13,862 కోట్లు, ఇంధన శాఖకు రూ. 13,600 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 31,806 కోట్లు కేటాయించారు. ఇదంతా అంకెల గారడీ అని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. సంపద సృష్టించి అభివృద్ధి ఫలాలను పేదలకు అందించి రాష్ట్ర స్థూలఉత్పత్తి (జిఎస్‌డిపి)ని 2047 నాటికి రూ. 2.4 లక్షల కోట్లకు పెంచాలనే బృహత్ లక్ష్యం అమలుకు ఎన్నో అవరోధాలున్నాయి.

ఇందుకు కేంద్రం, వివిధ సంస్థలు, అంతర్జాతీయ సహాయ సహకారాలతో నవ్యాంధ్రలో సేద్యం, పరిశ్రమలు, ఐటి, ఫార్మా, సేవా, శాస్త్ర, విజ్ఞాన సాంకేతిక రంగాలను ఉత్తేజితం చేసి, పారిశ్రామికీకరణ ద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పనను మెరుగు పరచాలి. భారత్‌కు స్వాతంత్ర్యం లభించి 2047 కు వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలంటే రాష్ట్రాలు, కేంద్రం పరస్పర అవగాహన సమన్వయంతో వ్యవహరిస్తేనే లక్ష్యాలను సాధించగలం. ఆంధ్రప్రదేశ్‌కు 972 కి.మీ విస్తారమైన సముద్ర తీరం ఉండటం ఓ వరం. మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తూ, భారత ప్రభుత్వ సాగరమాల పథకం కింద విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయంపేట, నిజాం పట్నం, కృష్ణపట్నం రేవులను ఇతోధికంగా అభివృద్ధి చేసి ఉత్పత్తి కేంద్రాలతో అనుసంధానించి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేయాలి. సోదర తెలుగు రాష్ట్రం తెలంగాణకు సముద్రతీరం లేనందున మచిలీపట్నం తదితర రేవులను తెలంగాణ సహకారంతో ఉభయ తారకంగా అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలి.

భారత ప్రభుత్వం ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ అనే ఉదాత్త కార్యక్రమం ప్రారంభించింది. దేశానికి స్వాతం త్ర్యం వచ్చి 78 ఏళ్ళైనా ఇప్పటికీ రక్షిత మంచినీరు సరఫరా లేని గ్రామాలెన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. జలజీవన్‌కు బడ్జెట్‌లో రూ. 2800 కోట్లు కేటాయించి మారుమూల ప్రాంతాలకు సైతం నీరందించాలనే ఆర్థిక మంత్రి కేశవ్ ప్రయత్నం హర్షణీయం. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ. 6 వేల కోట్లు కేటాయించడం సరైందే. కేంద్ర ప్రభుత్వం పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినందున వచ్చే మూడేళ్ళలో పూర్తి చేసి గరిష్ఠ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాలి. నిర్వాసితులకు సహాయ పునరావాసానికికేంద్రం నుండి గరిష్ఠంగా నిధులు రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి కృషి చేయాలి. వెనుకబడిన కరవు ప్రాంతాలలో నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రతి ఇంటిలో బడికి వెళ్ళే ప్రతి బాలబాలికలకు తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఇవ్వడానికి బడ్జెట్‌లో రూ. 9,407 కోట్లు, ఆరుగాలం కష్టించి పని చేసే రైతన్నలకు అన్నదాతా సుఖీభవ పథకం క్రింద ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం ఇచ్చే రూ. 6 వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 14 వేలు ఇవ్వడానికి బడ్జెట్‌లో రూ. 9407 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగినదే.

నేటి బాలలే రేపటి పౌరులు గనుక సంపూర్ణ అక్షరాస్యత సాధనకు తల్లికి వందనం ఎంతో మేలు చేస్తుంది. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్‌లు, ఇతర సాంకేతిక సంస్థలను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నవీకరించి, కృత్రిమ మేధ, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే ప్రపంచంలో వారు ఎక్కడైనా రాణించి దేశ ప్రతిష్ట పెంచుతూ స్వయం ఉపాధి పొందగలరు. మన పల్లె సీమల్లో ప్రజల ఆదాయాలు పెరగాలంటే పాడి పశువులు, కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకాన్ని ప్రోత్సహించి ఉపాధికి తోడ్పడాలి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వంటి కేంద్ర పథకాలను గరిష్టంగా ఉపయోగించుకోవాలి. కేంద్రం నుండి పంచాయతీరాజ్ నిధులను రాబట్టి గ్రామసీమల రూపురేఖలు మార్చడానికి ఉపముఖ్యమంత్రి కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ నిధులను రాబట్టాలి.

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, నదులు, కాలువలు, యేరుల ఆక్రమణలు తొలగించి వాటిని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాలను ప్రజా భాగస్వామ్యంతో చేపట్టాలి. రాష్ట్రంలో జాతీయ రహదార్ల అభివృద్ధికి కేంద్రం సానుకూలంగానే ఉన్నందున వాటి సత్వర పూర్తికి, కొత్త రైలు మార్గాల ద్వారా వివిధ ప్రాంతాలను చేరువచేయాలి. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వానికి చంద్రబాబు సారథ్యంలోని తెలుగుదేశం ప్రాణవాయువు అందిస్తున్నందున అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు అందించాలి. ప్రజాసేవ అంటే డబ్బు వెదజల్లి గెలిచి మళ్ళీ ప్రజల నుండి ప్రతీ పనికి కమిషన్‌లు గుంజే దోపిడీకి స్వస్తి చెప్పి ప్రజలకు మేలు చేసే పనులపై ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి రాజకీయమంటే సేవచేసే పవిత్ర కర్తవ్యమనే భావనను పెంపొందిస్తే వారిపై గౌరవం పెరుగుతుంది. బడ్జెట్ అమలుపై ప్రజాప్రతినిధులు నిమగ్నమైతేనే సార్థకత.

# సిట్ ముందుకు ఈటల రాజేందర్



**హైదరాబాద్, :** ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సిట్ అధికారులు తాజాగా కీలక వ్యక్తులను విచారిస్తున్నారు. సోమవారం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. ఆయనను సాక్షిగా విచారించనుండగా, మరికాసేట్లో ఆయన సిట్ ఎదుట హాజరుకానున్నారు. ఇక ఇదే కేసులో వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేత బిల్ల సుధీర్ రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సోమవారం సిట్‌కు తమ వాంగ్మూలాలు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వారు “ట్యాపింగ్ లిస్టులో ఉన్న నంబర్ మీరు వాడుతున్నదేనా? ఎప్పుడైనా ఫోన్ ట్యాపింగ్ అనుమానం కలిగిందా?” అని సిట్ అధికారులు తమను ప్రశ్నించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన హర్షవర్ధన్ రెడ్డి, “ఎవరితో మాట్లాడుతున్నామో గుర్తించి, మఫ్టీలో పోలీసులు వెంటాడుతున్నారని అనిపించేది” అని చెప్పారు. ట్యాపింగ్ వ్యవహారం రాజకీయ దురుద్దేశాలను సూచిస్తోందని నేతలు అభిప్రాయపడ్డారు.

# ఇరాన్ కీలక ప్రకటన..
## ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ జరిగినట్లు ప్రకటన



**న్యూఢిల్లీ,:** ఇజ్రాయెల్‌తో యుద్ధం ముగిసినట్లుగా ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ జరిగినట్లుగా తాజాగా ఇరాన్ ప్రభుత్వ మీడియా అంగీకరించింది. తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ జరిగినట్లుగా సోషల్ మీడియాలో తెలిపారు. 24 గంటల్లో దశల వారీగా కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. మొదట ట్రంప్ ప్రకటనతో ఇరాన్ అంగీకరించలేదు. అలాంటిది ఏమీ లేదని పేర్కొంది. ఇంతలోనే ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి ప్రయోగించింది. ముగ్గురు చనిపోయారు. భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడి అనంతరం తాజాగా కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్లుగా ఇరాన్ ప్రకటించింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజులుగా భీకర దాడులు జరిగాయి. జూన్ 13న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఇంతలో అమెరికా జోక్యం పుచ్చుకుని ఇరాన్‌లోని మూడు ముఖ్యమైన అణు కేంద్రాలను ధ్వంసం చేసింది. అనంతరం ఇజ్రాయెల్ కూడా దాడులు చేసి పూర్తిగా ధ్వంసం చేసింది. మొత్తానికి మంగళవారం ఉదయం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగినట్లుగా ట్రంప్ వెల్లడించారు. తొలుత ఇరాన్ అంగీకరించలేదు. తాజాగా కాల్పుల విరమణ జరిగినట్లుగా ఇరాన్ పేర్కొంది.

# ఏపీలో ఆటో డ్రైవర్లకు చంద్రబాబు గుడ్ న్యూస్..!



**అమరావతి,:** ఏపీలో ఆటో డ్రైవర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు వాహన మిత్ర పేరుతో ఆటో డ్రైవర్లకు ఏడాదికి 10 వేల చొప్పున సాయం అందించే వారు. జగన్ నవరత్నాల హామీ అమలులో భాగంగా ఇలా ఇచ్చే 10 వేల రూపాయలతో వారు ఆటోలకు చిన్న చిన్న రిపేర్లు, ఇన్సూరెన్స్ తీసుకోవడం వంటివి చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి ఈ సాయం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. నిన్న కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సుపరిపాలనలో తొలి అడుగు సభలో సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించిన చంద్రబాబు.. అదే సమయంలో ఆటో డ్రైవర్లను కూడా ఆదుకుంటామని వెల్లడించారు. దీంతో ఆటో డ్రైవర్లకు ఊరట కలగబోతోంది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో తమకు ఇబ్బందులు ఉంటాయని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. దీంతో వారికి కూడా అదే రోజు సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. వాస్తవానికి ఇప్పటివరకూ ఆటో డ్రైవర్లకు సాయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ చంద్రబాబు ఉన్నట్లుండి ఇలా ఆటో డ్రైవర్లకు సాయంపై చేసిన ప్రకటనపై చర్చ జరుగుతోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి 10 వేల రూపాయలు సాయంగా ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు చంద్రబాబు కూడా దానికి పేరు మార్చి అదే మొత్తం ఇస్తారా లేక అంతకన్నా ఎక్కువే ఇస్తారా అన్నది చూడాల్సి ఉంది. అప్పట్లో అందిన 10 వేలు ఇచ్చినా చాలని ఆటో డ్రైవర్లు చెప్తున్నారు.

# రైతుల ఖాతాల్లోకి రూ.20,000.. మరో బిగ్ అప్‌డేట్



అమరావతి: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రైతన్నలకు ఏటా రూ.20,000 అందించే అన్నదాత - సుఖీభవ పథకాన్ని ఈ నెల చివరిలో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన డబ్బులూ ఈ నెలాఖరులోనే జమ కానుండగా.. అదే రోజు అన్నదాత - సుఖీభవను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం ఇచ్చే రూ.2000తో కలిపి ఏపీ ప్రభుత్వం అదనంగా రూ.5000 జమ చేయనుంది. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం ఏడాదికి మూడు విడతల్లో రూ.6000 అందిస్తోంది. దీనికి మరో రూ.14,000 కలిపి ఏపీ ప్రభుత్వం రైతులకు అందించనుంది. ఈ పథకంలో భాగంగా 2వ విడతగా అక్టోబర్‌లో రూ.7000, వచ్చే ఏడాది జనవరిలో రూ.6000 రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. మొదట అన్నదాత సుఖీభవ పథకం నిధులను జూన్ 20న విడుదల చేయాలని భావించారు. అయితే ఈ కార్యక్రమం ఈ నెలాఖరుకు వాయిదా పడినట్లు తెలిసింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏపీవ్యాప్తంగా మొత్తం 45.71 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.

# ఉత్తీర్ణత మెరుగు.. నైపుణ్యాల తరుగు



‘విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాంబీ పాత్రత్వాత్ ధనమాప్నోతి, ధనాత్ ధర్మం తతః సుఖం అంటే, విద్య వినయాన్ని ఇస్తుంది, వినయంతో వ్యక్తి పాత్రత (యోగ్యత) పొందుతాడు. పాత్రత వలన ధనం వస్తుందిబీ ధనంతో ధర్మం, ధర్మంతో చివరికి సుఖం లభిస్తుంది. ఇంతటి విశిష్టతను కలిగిన విద్య భగవంతుడు మనిషికి ప్రసాదించిన గొప్ప జ్ఞానసంపద. విద్య ఒక దేశ మానవ వనరుల నిర్మాణ సాధనం మాత్రమే కాదు, ఆ దేశ సంస్కృతి, సమాజ నిర్మాణం, ఆర్థిక అభివృద్ధికి ఆధారంగా నిలిచే మూలస్తంభం కూడా. విద్య విద్యార్థులను పట్టభద్రులుగా తయారుచేసే ప్రక్రియ మాత్రమే కాదు, శాస్త్ర జ్ఞానంతోపాటు విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా, నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది పటిష్టమైన దేశనిర్మాణంలో కీలకపాత్రను పోషించే జ్ఞానభాండాగారం కూడా. విద్య పాఠ్యపుస్తకాల పఠనంతో ముగిసే అభ్యాసం మాత్రమే కాదు, ఆలోచనాశక్తిని వికసింపజేసి, జ్ఞానాన్ని ప్రసాదించి, సరైన జీవనమార్గాన్ని ఉపదేశించే గొప్ప మార్గదర్శి. భారతదేశానికి విద్యతో ఉన్న అనుబంధం చారిత్రికంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా చాలా అపారమైనది. భారతీయ జ్ఞానసంపద ప్రాచీన కాలంలోనే ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే స్థాయిలో విస్తరించి ఉండేది. అనాదిగా భారతదేశం జ్ఞానభూమి, విద్యాక్షేత్రంగా ప్రఖ్యాతి గాంచింది. ‘సర్వేపి విద్యా సర్వత్ర గమ్యం’ అనే తత్త్వంతో, విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాక, జీవన మౌలికంగా భావించిన దేశం భారతదేశం. అయితే, కాలక్రమేణ పాలనా విధానాల మార్పులు, సామాజిక పరిణామాలు, ప్రపంచీకరణ వంటి ప్రభావాలతో భారతీయ విద్యా విధానం ఎన్నో రూపాంతరాలు చెందుతూ వస్తున్నది. భారతీయ విద్యా వ్యవస్థకు మూలం గురుకుల పద్ధతి. ఇందులో విద్యార్థి గురువుతో నివసిస్తూ విజ్ఞానం, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం అనే మూడు మూలస్థంభాలపై విద్యను ఆచరణాత్మకంగా అభ్యసించేవాడు. వేదాలు, ఉపనిషత్తులు, అర్థశాస్త్రం, ఖగోళశాస్త్రం, వైద్యశాస్త్రం వంటి శాస్త్రాలు బోధించబడేవి. విద్యార్థులు క్రమశిక్షణ, ధ్యానం, సేవ, సత్యం వంటి విలువలతో విద్యను సమగ్రంగా అభ్యసించేవారు. ఇస్లామీయ పాలనలో మదర్సాలు ప్రధాన విద్యా కేంద్రాలుగా మారాయి. వీటిలో అరబిక్, ఫార్సీ భాషలతోపాటు ఇస్లామీయ ధర్మశాస్త్రాలు బోధించబడేవి. సాధారణ ప్రజలు విద్యలో పాల్గొనే అవకాశం తగ్గింది. ఖగోళ శాస్త్రం, వైద్యం, సాహిత్యం, కళల అభివృద్ధి కొనసాగింది. 1835లో మకాలే ప్రవేశపెట్టిన విద్యా విధానం భారతీయ విద్యను ప్రగాఢంగా ప్రభావితంచేసింది. ఉద్యోగాలకే విద్యను లక్ష్యంగా చేస్తూ, పాఠశాలలు, కళాశాలల ద్వారా పరీక్షల ఆధారిత వ్యవస్థ రూపొందించబడినది. జ్ఞానాన్ని మార్కుల రూపంలో అంచనా వేసే ధోరణి మొదలైంది. భారతీయ భాషలు, సంప్రదాయ పాఠ్యాంశాలు మరుగున పడి, ఇంగ్లీష్ మాధ్యమం ప్రాధాన్యతను సంతరించుకున్నది. గురుకులాల స్థానాన్ని పాఠశాలలు, కళాశాలలు ఆక్రమించాయి. స్వాతంత్ర్యానంతరం విద్య అందరికీ సమానంగా అందించాలనే దృష్టితో జాతీయ విద్యా విధానాలు (ఎన్ఇపి) ప్రవేశపెట్టబడ్డాయి.

ప్రాథమిక హక్కులపై దృష్టి, స్థానిక భాషల్లో బోధన, నైతిక విలువల ప్రాధాన్యం, సాంకేతిక వినియోగం, వెనకబడిన వర్గాల పిల్లలకు ప్రోత్సాహం వంటి అంశాలు ఇందులో ప్రతిఫలించాయి. నేటి విద్యా విధానం కాలంతోపాటు వేగంగా మార్పు చెందుతున్నా, ఆ మార్పు దిశలో ఎన్నో నిగూఢ లోపాలు కనబడుతున్నాయి. విద్యకు మూలమైన జ్ఞానం, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసాలకు ప్రాధాన్యత తగ్గి, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలకే ప్రాధాన్యత పెరుగుతున్నది. విద్యార్థికి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 10 గంటల వరకూ కొనసాగే ఒకే ఒక్క దినచర్యగా విద్య మారడంతో విద్యార్థులు మానసికంగా, శారీరికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థులు పాఠ్యాంశాన్ని ‘ఎందుకు నేర్చుకోవాలి?’ అన్న జిజ్ఞాస లేకుండా, కేవలం ఉత్తీర్ణత కోసం గుర్తుపెట్టుకోవాల్సిన అంశంగా మాత్రమే భావిస్తున్నందువల్ల సొంతంగా పరిశీలించటం, ఆలోచించటం, ఆచరించటం వంటి సామర్థ్యాలను క్రమంగా కోల్పోతున్నారు. ఉన్నత పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు బోధించే విద్యను విద్యార్థికి కీలకమైన దశగా చెప్పవచ్చు. ఎందుకంటే, ఈ దశలో నేర్చుకునే పాఠ్యాంశాల్లోని ప్రాథమిక భావాలు, సూత్రాలు, సిద్ధాంతాలు, భాషా వ్యాకరణం, వ్యక్తిత్వ వికాసం విద్యార్థి భవిష్యత్తు విద్యకు అత్యంత మూలాధారమైనవి. కానీ, ప్రాథమిక అంశాలను క్షుణంగా నేర్పకుండానే, కేవలం ఒక విషయాన్ని ఎక్కువ సార్లు గుడ్డిగా విద్యార్థులతో సాధన చేయించడం ద్వారా మార్కులు, ర్యాంకులు సాధించే విధానం ప్రస్తుతం కొనసాగుతున్నది. దీని ఫలితంగా ప్రాథమిక అంశాలపై అవగాహన లేని విద్యార్థులు ఉన్నత విద్యలో వెనుకబడిపోతున్నారు. అలాగే, ఈ దశలో భాషా శాస్త్రాలకు సరైన ప్రాధాన్యతను ఇవ్వకపోవడం వల్ల, భాషా పరీక్షల్లో నూరుశాతం మార్కులు సాధించిన విద్యార్థులు కూడా, వ్యాకరణ దోషాలు లేకుండా మాట్లాడడం, వినడం, చదవడం, రాయడం లాంటి నైపుణ్యాలలో ఘోరంగా విఫలమవుతున్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తు విద్యకు, ఉద్యోగ సాధనకు పెద్ద లోపంగా మారుతున్నది. విద్యను గమ్యంగా కాక, నిరంతర ప్రయాణంగా చూడాలి. ఇది ఒక వయస్సుతో ముగిసే ప్రక్రియ కాదు. పరీక్షలు రాయడం, మార్కులు సాధించడం, డిగ్రీలు పొందడం విద్యలో ఒక భాగం మాత్రమే, ముగింపు కాదు. వాస్తవానికి విద్యాభ్యాసం అనేది జీవితాంతం కొనసాగే ప్రక్రియ. అనుభవాల నుంచి నేర్చుకోవడం, కొత్త విషయాల పట్ల ఆసక్తి కనబరచడం, విలువల పట్ల అవగాహన పెంచుకోవడం విద్యాసాధనకు ఉత్తమ మార్గాలు. ఒకప్పుడు జ్ఞానసంపదను పంచే సరస్వతీ ఆలయాలుగా భావించబడిన విద్యాసంస్థలు నేడు లాభాపేక్షతో వ్యాపార సంస్థలుగా మారిపోయాయి అనడంలో అసత్యం లేదు. శాస్త్ర జ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, భాషా ప్రావీణ్యత, ఆచరణాత్మక సామర్థ్యం, సృజనాత్మకత, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసాలను పెంపొందించేలా విద్యా ప్రణాళికలను, పాఠ్యాంశాలను రూపొందించి, వాటిని ఆచరణలోకి తీసుకురావాలి. విద్యాసంస్థలు తమ పాఠ్యప్రణాళికలలో వీటిని పొందుపరచడమే కాదు, విద్యార్థులు వాటిని కేవలం పరీక్షల కోసమేనని భావించకుండా, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలి. విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ ‘విద్య కేవలం ఉత్తీర్ణత కోసమే’ అన్న దృష్టి కోణాన్ని మార్చుకోవాలి. ప్రతి విద్యార్థిని ఏదో రీతిలో ఉత్తీర్ణుడిని చేయాలన్న ఆలోచన నుంచి తన మేధస్సును ఉపయోగించి సాధన చేసిన విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణత సాధించాలనే ఆలోచనకు అందరూ మారాలి. విద్యా దీపాన్ని జ్ఞానంతో ఒక్కసారి వెలిగిస్తే, అది జీవితాంతం వెలుగును ప్రసరిస్తుంది.

# అమెరికా యుద్ధచర్యను ఖండించాలి!




ఇరాన్ అణుకేంద్రాల మీద బి2 బాంబర్లతో దాడిచేసిన అమెరికా దుశ్చర్యను యావత్ సభ్య సమాజం ఎలుగెత్తి ఖండించాల్సిన అవసరం ఉంది. ఈ చర్య ఏ విధంగా చూసినప్పటికీ అన్ని చట్టాలు, సాంప్రదాయాలు, సార్వభౌమత్వాలను హరించేదిగా ఉన్నందున యుద్ధ నేరాల కింద విచారించాలి. ఒక దేశం అణుకార్యక్రమం కలిగి ఉండాలా లేదా అన్నది దానికి సంబంధించిన అంశం. ఇరాన్ అణుకార్యక్రమం నుంచి వైదొలిగితే దానికి తగిన విధంగా పరిహారం లేదా మరొకవిధంగా లబ్దిచేకూర్చుతామని 2015లో ఒప్పందం చేసుకున్నది అమెరికా. దాన్నుంచి ఇదే డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2018లో ఏకపక్షంగా వైదొలిగింది కూడా అమెరికానే. ఆ కారణంగానే ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. ఏ విధంగా చూసినప్పటికీ అది సమర్థనీయమే. ఒక వేళ చట్టవిరుద్ధం అనుకుంటే దానికి ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి, ఇతర సంస్థలున్నాయి. వాటిలో చర్చ జరగాలి. దోషం ఏదైనా ఉంటే అక్కడ తేల్చాలి తప్ప దాడి చేయటానికి ఇజ్రాయిల్‌కు, దానికి సమర్థనగా బాంబులు వేసేందుకు అమెరికాకు ఉన్న హక్కేంటి? ఈదాడిలో అణుకేంద్రాలు ధ్వంసమయ్యాయా లేదా అన్నది వేరే అంశం. అసలు దాడి చేయటానికి అదెవరు? తమపై అమెరికా దాడికి పూనుకుంటే ప్రతి చర్యలు ఉంటాయని ఇరాన్ ముందునుంచే హెచ్చరించింది. అయితే ఇది రాసే సమయానికి ఇరాన్ వైపు నుంచి ఇజ్రాయిల్ మీద కొనసాగుతున్న క్షిపణి దాడులు తప్ప అమెరికా సైనిక స్థావరాలు లేదా మధ్యధరా సముద్రంలో, ఇతర చోట్ల ఉన్నదాని యుద్ధ నౌకల మీద గానీ ఎలాంటి దాడులు జరిగినట్లు వార్తలు లేవు. ఇరాన్ మీద అమెరికా దాడితో ఇరానీయన్లు భయభ్రాంతులకు గురైతే ఇరాన్ చేసిన హెచ్చరికతో ప్రపంచంలో ఉన్న ప్రతి అమెరికన్ తమకు ఎప్పుడేం జరుగుతుందో అని వణికి పోతున్నారు. కడుపు మండిన వారు ఎప్పుడేం చేస్తారో తెలియదు. బాధ్యతారహితమైన ట్రంప్ దుశ్చర్య అమెరికన్లను ప్రమాదంలోకి నెట్టింది. ఈ చర్యకు నిరసనగా అమెరికాలో కొన్ని చోట్ల వ్యతిరేక ప్రదర్శనలు జరిగినట్లు వార్తలు. రెండవ ప్రపంచ యుద్ధం చివరిలో ఓడిపోయి చేతులెత్తేసిన జపాన్‌పై అణుబాంబులు వేసిన అమెరికా చర్య దాన్ని దెబ్బతీయటానికి కాదు, తన దగ్గర ఎలాంటి ప్రమాదకర ఆయుధం ఉందో చూపి యావత్ ప్రపంచాన్ని తనకు దాసోహం చేసుకొనే దుష్టయత్నం. ఈ రోజు అణుకార్యక్రమం గురించి తాను చెప్పినట్లు వినలేదని బాంబులు వేసిన అమెరికా, రేపు మరొక దేశం మరొక కారణంతో తనకు లొంగకపోతే ఇదే విధమైన దుర్మార్గానికి పాల్పడదనే నమ్మకం ఏముంది? కొన్ని దేశాలనైనా భయపెట్టేందుకు అమెరికా చేసిన దాడి తప్ప మరొకటి కాదు. నాడు అణుబాంబులు చూసి ప్రపంచాన్ని బెదిరిస్తే తర్వాత సోవియట్, చైనా, తదితర దేశాలన్నీ అణుబాంబులను సమకూర్చుకున్న కారణంగానే అమెరికా అదుపులో ఉంది. మనదేశం కూడా అణుపరీక్షలు జరపరాదని అమెరికా బెదిరించింది. అయితే సోవియట్‌తో ఉన్న రక్షణ ఒప్పందం, తదితర కారణాలతో అది ఇరాన్ మాదిరి దాడుల దుస్సాహసానికి పూనుకోలేదు. అయితే మనమీద ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు అంతరిక్ష రంగంలో మనం కూడా ఎక్కడ పోటీకి వస్తామో అన్న ఉక్రోషంతో ఆ కార్యక్రమం, ప్రయోగాలను కూడా అడ్డుకొనేందుకు చూసింది. మనదేశాన్ని లొంగదీసుకొనేందుకు కాశ్మీరు, పంజాబ్, ఈశాన్య ప్రాంతంలో ఉగ్రవాదులను రెచ్చగొట్టి తలనొప్పులు కలిగించింది. పశ్చిమాసియాలో ఇరాన్‌ను లొంగదీసుకొనేందుకు, చమురు సంపదను కొల్లగొట్టేందుకు అక్కడ ఏర్పాటు చేసిన తొత్తు పాలకులనో తోసిపుచ్చి జనం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దానికి లౌకికశక్తులు నాయకత్వం వహిస్తు న్నాయా? మతశక్తులా అన్నది వారి అంతర్గత వ్యహారం. జనమే తేల్చుకోవాల్సిన అంశం. మతశక్తులే అనుకుంటే వారి నాయకత్వంలో ఉన్న ప్రభుత్వంతోనే కదా అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకున్నది, వైదొలగిందన్నది మరచిపోరాదు. అనేక దేశాల్లో నియంతలు పాలకులుగా ఉన్న దేశాలను అమెరికా సమర్థించింది, మద్దతు ఇచ్చింది. అమెరికా దాడులు చేసినా తమ అణుకార్యక్రమం కొనసాగుతుందని ఇరాన్ ప్రకటించింది. అమెరికా దుర్మార్గాన్ని ఖండించటంలో ఐరాస, చైనా, రష్యా ముందున్నాయి. ప్రపంచ విశ్వగురువును తానే అనుకుంటున్న మనదేశం ఇంతవరకు నోరుమెదపలేదు. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను ఆపివేయాలన్న ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా ఓటింగ్‌ను బహిష్కరించినపుడే మనమీద ఎవరి ఒత్తిడి పని చేస్తున్నదో తేలిపోయింది, ఇప్పుడు ఇరాన్‌పై జరిపిన అమెరికా దాడిని ఖండించగలదని ఎవరైనా ఎలా ఆశించగలరు?

# మత్తులో యువత చిత్తు



నిర్మల్ జిల్లాలో చిన్న, పెద్ద తేడా లేకుండా యువత, వృద్ధులు, చిన్నపిల్లలు సైతం మత్తు పదార్థాలకు బానిసలు కావడం ఈ ప్రాంతంలో కలకలం రేపుతున్నది. డ్రగ్ ఫ్రీ జిల్లాగా మారుస్తామని ప్రకటిస్తున్న అధికారులకు సవాళ్లు విసిరే రీతిలో ఎత్తుకు పైఎత్తు వేస్తూ తమ మత్తు దందాను కొనసాగిస్తూపోతున్నారు. అక్రమార్కులు తాజాగా జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో చిట్యాల వాగు శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఏకంగా మత్తుపదార్థాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కలకలం రేపుతున్నది. శనివారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు జరిపిన దాడుల్లో బయటపడ్డ బాగోతం అధికారులనే నివ్వెరపరిచింది. కల్తీ కల్లులో కలిపే సిహెచ్‌ను తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న అబ్కారీ, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ రెండు కార్లు అనుమానాస్పద స్థితిలో పట్టుబడ్డాయి. అందులోని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తే మత్తు పదార్థాల తయారీ కేంద్రం వివరాలు వెలుగు చూడడమే కాకుండా వారి వద్ద నుండి 10 లక్షల రూపాయలు విలువ చేసే కిలో అల్ప్రాజోలం, మరో రూ. 10 లక్షల విలువ గల 425 కిలోల క్లోరల్ హైడ్రెల్ లభ్యమైంది. ఈ ప్రాంతంలో తెల్లగల్లును పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తాగుతారు. అయితే గత కొన్నేళ్లుగా ప్రజలు మత్తు కల్లుకు బానిసలయ్యారు. నిషేధిత మత్తు పదార్థాలను కలుపుతూ కల్తీ కల్లు విక్రయించడం ఇక్కడ మామూలే. అయితే ఇప్పటి వరకు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి కల్తీ కల్లులో కలిపే మత్తు పదార్థాలను తీసుకొచ్చి నిల్వచేసేవారు. కాని ఇప్పుడు ఇక్కడే తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ముంబై సమీపంలోని భీవండి ప్రాంతం లో క్లోరో అనే ద్రవపదార్థం ఇక్కడికి తీసుకు వస్తున్నారు. దానితో సిహెచ్ తయారు చేస్తున్నారు. 50 లీటర్ల క్లోరోకు 9 లీటర్ల నీటిని కలుపుతారు. దీన్ని డ్రమ్ములో పోసి గుంతలు తవ్వి చుట్టూ ఐస్‌ను పేరుస్తారు. దాదాపు 10 రోజులు అలాగే ఉంచుతారు. చల్లదనం కారణంగా అదంతా గడ్డ కడుతుంది. దీన్ని సిఎస్‌గా మార్చి విక్రయానికి వినియోగిస్తున్నారు. ఇవి బయటపడడం చర్చనీయాంశమైంది. అయితే జిల్లాలో కల్తీ కల్లుతో పాటు గంజాయి దందా సైతం కొనసాగుతున్నది. గత నెలలో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రుల్లో పనిచేసే ముగ్గురు ల్యాబ్ ఎక్స్‌రే టెక్నీషియన్‌లు, ఓ యువకుడు శస్త్రచికిత్సలకు వాడే మెడా జోలం ఇంజక్షన్లను యువతకు అక్రమంగా అందజేస్తూ పట్టుబడ్డాడు. ఈ మందు ప్రాణాంతకమే. ఖానాపూర్‌లో బాటిల్ షాట్ అనే కొత్త పద్ధతిలో యువకుడు గంజాయి, బోను ఫిక్స్ మిశ్రమాన్ని బాటిల్‌లో రంధ్రం చేసి పెన్ను మూత ద్వారా పీలుస్తున్నారు. ఈ ప్రమాదకర అలవాటుకు యువత తెలియకుండానే బానిసలవుతున్నారు. అంతేగాకుండా వైట్‌నర్, దగ్గు మందులు, నిద్రకు ఉపయోగించే బిల్లలను సైతం మత్తుకోసం వాడుతున్నవారున్నారు. ఈ వ్యవహారం జిల్లాలో యువత మత్తుబారిన పడడానికి కారణమవుతుంది. కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ మత్తుకు బానిస అవుతుండడం ఒక రకంగా పరిస్థితులు ఎటు వైపు వెళుతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందంటున్నారు. అంతేగాకుండా గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాలు గంజాయి పంట సాగు చేసిన సంగతి బయటపడింది. అమాయక రైతులను మభ్యపెట్టి దందా కొనసాగిస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా డ్రగ్ ఫ్రీ జిల్లాగా మారేలా ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేస్తేనే యువత, ప్రజలు మత్తునుండి బయటపడతారని లేకుంటే ఆ దేవుడు కూడా కాపాడే పరిస్థితులు లేకపోవచ్చన్న అభిప్రాయం జిల్లా వ్యాప్తంగా వ్యక్తమవుతున్నది. జిల్లాలో మత్తు నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్ చెప్పారు. గత ఏడాది అక్టోబర్ నెలలో నిర్మల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఖానాపూర్ ప్రాంతంలో గుడుంబ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అంతేగాకుండా జిల్లాలోని భైంసా ప్రాంతంలో కల్లులో క్లోరో హైడ్రేట్ (సీహెచ్) కలపకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు ఎక్కడైనా కల్లులో మత్తు పదార్థాలు కలుపుతున్నట్లు తనకు సమాచారం ఇస్తే అప్పటికప్పుడే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల జగిత్యాలకు తరలుతున్న మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

# సేంద్రియ బియ్యంతో జగన్నాథునికి అమృతాన్న భోగం



భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దైనందిన భోగాల నివేదనలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది రథ యాత్ర మొదలుకొని స్వామి వారికి అమృత అన్న భోగం నివేదన ప్రారంభించనున్నారు ఈ కార్యాచరణలో భాగంగా రథ యాత్ర నుంచి గుండిచా మందిరం అడపా మండపంలో కొఠా భోగ సమయంలో మహా ప్రభువుకు అమృత అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. సోమవారం మందిరం ప్రధాన నిర్వాహకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాడీ అధ్యక్షతన జరిగిన అధికారిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బొడు సువార్, సువార్ మహాసువార్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. సువార్ మహాసువార్ భోగ మండపంలో అమృత అన్నం ఉపయోగించాలని ప్రతిపాదించారు. మహా ప్రభువు భోగం తయారీలో అమత అన్నాన్ని ఉపయోగించడం గురించి గతంలో చర్చించి ప్రయోగాత్మకంగా ఈ చర్యని అమలు చేశారు. కొరాపుట్ ప్రగతి ఇనిస్టిట్యూట్ అమృత అన్నం బియ్యం సరఫరాకు మద్దతు ప్రకటించిందని సీఏఓ తెలిపారు. ఈ సంస్థ ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

### సేంద్రియ బియ్యంతో ప్రసాదం తయారీ..

మందిరంలో జగన్నాథుని అన్న ప్రసాదాలు మహా ప్రసాదంగా ప్రతీతి. ఈ ప్రసాదం సేంద్రియ బియ్యాన్ని ఉపయోగించి తయారు చేయాలని పాలక వర్గం నిర్ణయించడం ప్రత్యేకత సంతరించుకుంది. స్వామి నిత్య అన్న ప్రసాదాల తయారీలో సేంద్రియ బియ్యం వినియోగిస్తారు. ఈ బియ్యంతో వండిన ప్రసాదాల్ని అమృత్ అన్నం అనే ప్రత్యేక పేరుతో వ్యవహరిస్తారు. ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా సహజమైన ఎరువులను ఉపయోగించి సాగు చేసిన బియ్యం మాత్రమే వినియోగిస్తారు. తొలి దశలో స్వామికి నివేదించే కొఠా భోగ సేవలో మాత్రమే వినియోగిస్తారు. తదుపరి దశలో ఇతర అన్ని వంటకాల్లో ఈ బియ్యం వినియోగం బలపరుస్తారు. రాష్ట్రంలో రైతులు పండిస్తున్న కొళాజీర, పింపుడిబాసొ, యువరాజ్ మొదలైన సేంద్రియ బియ్యాన్ని అమృత అన్న మహా ప్రసాదంలో ఉపయోగిస్తారు. మందిరంలో రోజుకు 50 నుండి 55 క్వింటాళ్ల బియ్యంతో స్వామి మహా ప్రసాదం వంటకం అవుతుంది. ప్రత్యేక ఉత్సవాలు, పండగపబ్బాల సందర్భంగా రోజుకు 100 నుండి 200 క్వింటాళ్ల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అదనంగా కొఠా భోగం కోసం ప్రతి రోజూ 100 కిలోల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అన్న మహా ప్రసాదానికి అధిక నాణ్యత గల బియ్యం వినియోగానికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. పిండి వంటల ప్రసాదాల తయారీలో మసూరి బియ్యం కొనసాగుతుంది. క్రమంగా వీటి స్థానంలో అమృత్ అన్నం బియ్యం వినియోగించే యోచన ఉన్నట్లు పేర్కొన్నారు. పథకం ప్రకారం మందిరం అన్న ప్రసాదాల తయారీలో కొరత లేకుండా అమృత అన్నం బియ్యం సరఫరా చేసేందుకు కనీసం నాలుగు వందల నుంచి ఐదు వందల ఎకరాల భూమిలో సేంద్రియ వరి సాగు అవసరం అని అనుభవజ్ఞుల వర్గం పేర్కొంది. మందిరం పాలక వర్గం ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా కొనసాగిస్తుంది.

# రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం.. పొన్నం పిలుపు




హైదరాబాద్, జూన్ 24: నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండు సార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి , ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

# భాజపాలో చేరడానికి అవి సంకేతాలు కావు: శశిథరూర్



ఇంటర్నెట్‌డెస్క్: మోదీ సర్కారు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ . తాజాగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాలపై ప్రశంసలు కురిపిస్తూ ఆయన ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం చర్చనీయాంశమైంది. ఈక్రమంలో ఆయన భాజపా లో చేరడం ఖాయమనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ ఊహాగానాలపై తాజాగా థరూర్ స్పందించారు. 'ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వివరించిన వ్యాసం అది. అన్ని పార్టీల ఐక్యతను అది చెబుతోంది. ఇతర దేశాలతో సంబంధాలు బలపరుచుకోవడంలో ప్రధాని మోదీ శక్తి, చైతన్యం ప్రదర్శించారని నేను చెప్పా. ఇది భాజపా లేక కాంగ్రెస్ విదేశాంగ విధానాలకు సంబంధించింది కాదు. ఇది భారత విదేశాంగ విధానం గురించి మాత్రమే. నేను 11 ఏళ్ల క్రితం పార్లమెంటు విదేశాంగ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం పేర్కొన్నా. నేను ఇలా మాట్లాడటం భాజపాలో చేరడానికి సంకేతం కాదు. ఇది జాతీయ ఐక్యతకు సంబంధించింది' అని ఆయన పేర్కొన్నారు. శశిథరూర్ రాసిన వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం సోమవారం ఎక్స్‌లో పోస్టు చేసింది. అందులో ప్రపంచవ్యాప్తంగా దేశం ఒంటరిగా ఉందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు విరుద్ధంగా ఆయన పేర్కొనడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు రుజువుగా పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు, ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దృఢమైన ప్రతిస్పందనను చాటిచెప్పిందని తెలిపారు. ఇది మన విదేశాంగ విధానానికి కీలక ఘట్టాన్ని అందించిందని వ్యాఖ్యానించారు.

# అణుయుద్ధం.. నిజమెంత?



ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం రోజు రోజుకు మరింత ముదురుతోంది. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా మెరుపుదాడులతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజాగా.. సోమవారం తెల్లవారుజామున ఇరాన్ అర గంట వ్యవధిలోనే ఇజ్రాయెల్‌పై 22 క్షిపణులతో దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది మనసుల్లో మెదులుతున్న ప్రశ్న ఏమిటంటే.. ఈ యుద్ధం మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందా? అని!. ఈ ప్రశ్నకు సమాధానం అంత తేలిక కాదు. చాలా విషయాలను పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుంది. అవేంటో.. ఒక్కటొక్కటిగా చూద్దాం. 1.ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి దౌత్యవర్గాల్లో అణుయుద్ధంపై చర్చ జరుగుతూనే ఉంది. దశాబ్దాల తరువాత మధ్యప్రాచ్య పరిస్థితులు అణుయుద్ధానికి దారితీసేలా ఉన్నాయన్న వ్యాఖ్యలూ వినపిస్తున్నాయి. అయితే ఆ దారుణం జరక్కుండా చూసేందుకు ప్రభుత్వాధినేతలు చాలామంది తమవంతు ప్రయత్నాలూ చేస్తున్నారు. 2."అణుస్థావరాలపై అమెరికా దాడి యుద్ధం ప్రకటించడమే!" అని ఇరాన్ చెప్పడమే కాకుండా.. అణ్వాయుధాలకు సంబంధించిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం నుంచి వైదొలగే ఆలోచన కూడా చేస్తోంది. 1970 నుంచి అమల్లో ఉన్న ఈ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం నుంచి వైదొలగడం అంటే.. ఇరాన్ తనకు నచ్చినట్టుగా అణు ఇంధనాన్ని శుద్ధి చేసుకోగలదు. అణ్వాస్త్రాలూ తయారు చేసుకోగలదు. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) వంటి ఐరాస సంస్థల పర్యవేక్షణను అనుమతించదన్నమాట. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇరాన్ మరింత వేగంగా అణ్వాయుధాలను తయారు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. 3. ఇదిలా ఉంటే ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఏ దేశం ఎటువైపున ఉన్నదన్నది కూడా అణుదాడులు జరిగే అవకాశాలను నిర్ణయిస్తుంది. ఇరాన్‌పై అమెరికా దాడులను రష్యా, చైనా తీవ్రంగా ఖండించాయి. అయితే ప్రస్తుతానికి ఈ రెండు దేశాలూ ఇరాన్‌కు నేరుగా మిలటరీ సాయం చేసే స్థితికి చేరలేదు. టర్కీ, ఖతార్, సౌదీ అరేబియాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మరోవైపు భారత్‌సహా అనేక ఆసియా దేశాలు ఇరు పక్షాలకూ దూరంగా ఉంటున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇరుదేశాలకు సూచిస్తున్నాయి. 4. అమెరికా నిన్న ఇరాన్ అణు స్థావరాలపై బంకర్ బాంబులతో విరుచుకుపడ్డ నేపథ్యంలో ఐఏఈఏ ఒక హెచ్చరిక చేసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇరాన్-ఇజ్రాయెల్ ప్రాంతంలో రేడియోధార్మిక ప్రభావం పెరిగిపోవడం ఖాయమని స్పష్టం చేసింది. ఫోర్డో, నటాన్జ్, ఇస్ఫహాన్‌లలోని అణుస్థావరాలను తాము ధ్వంసం చేసినట్లు అమెరికా ?ప్రకటించినప్పటికీ ఆ ప్రాంతాల్లో రేడియోధార్మిక పదార్థాలేవీ లేవని ఇరాన్ ప్రకటించడం కొంత ఊరటనిచ్చే అంశం. సరిగ్గా దాడులు జరిగే ముందే ఇరాన్ ఫర్డో స్థావరం నుంచి సుమారు 400 కిలోల యురేనియం (60 శాతం శుద్ధత కలిగినది. ఆయుధాల తయారీకి కనీసం 90 శాతం శుద్ధమైన యురేనియం 235 అవసరం.)ను అక్కడి నుంచి తరలించినట్లు వార్తలొచ్చాయి. ఇంకోపక్క ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఇజ్రాయెల్ తన వైఖరిని సమర్థించుకోగా.. వాటిని సార్వభౌమత్వంపై దాడులుగా ఇరాన్ అభివర్ణించింది. మొత్తమ్మీద చూస్తే ప్రపంచం అణుయుద్ధపు అంచుల్లో ఉందని చెప్పలేము. ఇప్పటివరకూ యుద్ధం ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికాలకే పరిమితమై ఉంది. మధ్యప్రాచ్య దేశాలు, రష్యా, చైనా వంటి అభివృద్ధి చెందిన దేశాలు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఇందులో మార్పు లేనంత వరకూ అణుయుద్ధం జరిగే అవకాశం తక్కువే!.

# ఇజ్రాయెల్ దాడులతో ఆజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ

## చిక్కడు.. దొరకడు!
## ఆయన ఆచూకీ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు
## కంటికి రెప్పలా కాపాడుకుంటున్న భద్రతా దళాలు
## ఖమేనీ కోసం వేట సాగిస్తున్న ఇజ్రాయెల్ నిఘా వర్గాలు



ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నానాటికీ తీవ్రరూపం దాలుస్తోంది. దాడులు, ప్రతిదాడులకు పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధంలోకి అమెరికా సైతం అడుగుపెట్టడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. ఇజ్రాయెల్‌తోపాటు అమెరికాపై కత్తులు నూరుతున్న అసలు కథానాయకుడు, ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఇప్పుడు ఎక్కడున్నారు? అనేది టాప్ సీక్రెట్‌గా మారింది. దశాబ్దాలుగా ఇరాన్‌ను మకుటం లేని మహారాజులా ఏలుతున్న 86 ఏళ్ల ఖమేనీ కోసం ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వేట సాగిస్తున్నాయి. ఆయనకు విదేశాల్లోనే కాదు, సొంత దేశంలోనూ శత్రువులున్నారు. ఖమేనీ ఆచూకీ దొరికితే సజీవంగా బంధించి, చట్టప్రకారం శిక్షించడమో లేక అక్కడికక్కడే అంతం చేయడమో తథ్యమని పశ్చిమ దేశాల మీడియా అంచనా వేస్తోంది. ఇరాన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించాలంటే ఆయన ప్రాణాలతో ఉండడానికి వీల్లేదని ఇజ్రాయెల్, అమెరికా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ భౌతికంగా లేకుండాపోతేనే ఈ యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేయడం గమనార్హం. "ఖమేనీ ఆధునిక హిట్లర్. అతడు బతికి ఉండడానికి వీల్లేదు" అని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ సైతం అన్నారు.

### చావుకు భయపడే మనిషి కాదు

ఇరాన్‌లో ఈ నెల 12న ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడికి దిగింది. ఆ వెంటనే ఖమేనీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గుర్తుతెలియని ప్రాంతంలో అత్యంత పటిష్ఠమైన భద్రత కలిగిన బంకర్‌లో ఆయన క్షేమంగా ఉన్నట్లు ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. సుశిక్షితులైన బాడీగార్డులు ఆయనకు రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. ఖమేనీ కచ్చితంగా ఎక్కడున్నారో ఎవరికీ తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) అత్యున్నత స్థాయి అధికారులకు సైతం ఖమేనీ ఆచూకీ గురించి తెలియదని అంటున్నారు. ఇజ్రాయెల్ నిఘా వర్గాలకు ఏమాత్రం ఉప్పందకుండా ఇరాన్ సర్కారు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఖమేనీని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఉన్నత శ్రేణి భద్రతా దళం నిరంతరం ఆయనకు కాపలా కాస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఖమేనీ ప్రాణాలకు ఎవరూ హానీ తలపెట్టే అవకాశం లేకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమేనీ చావుకు భయపడే మనిషి కాదని, ఇరాన్ భవిష్యత్తు కోసం ఆయన ప్రాణాలతో ఉండడం అవసరమని అన్నారు.

### అమెరికా దాడుల తర్వాత బంకర్‌లోకి..

సాధారణ పరిస్థితుల్లో ఖమేనీ సెంట్రల్ టెహ్రాన్‌లోని ఓ కాంపౌండ్‌లో ఉంటారు. అక్కడి నుంచి విధులు నిర్వర్తిస్తారు. మిలటరీ కమాండర్లు, అధికారులతో ప్రతివారం సమావేశమవుతారు. ప్రజలతో మాట్లాడాలన్నా ఇక్కడే. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరు. ఇజ్రాయెల్ దాడులు మొదలైన వెంటనే ఖమేనీ బంకర్‌లోకి వెళ్లలేదని సమాచారం. బయటే ఉంటూ ప్రతిదాడికి వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 21న అమెరికా సైన్యం యుద్ధరంగంలోకి అడుగుపెట్టిన తర్వాతే ఆయన బంకర్‌లోకి చేరుకున్నారు. మూడు ప్రధాన అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఖమేనీ మరింత అప్రమత్తమయ్యారు. తన విశ్వాసపాత్రులైన అనుచరులు, సహాయకులతోనూ కమ్యూనికేషన్ తగ్గించుకున్నారు. ఫోన్లు ఉపయోగించడం ఆపేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉంటున్నారు. శత్రువులకు తన ఆచూకీ చిక్కకుండా ఉండడానికే ఈ జాగ్రత్త. శత్రువుల చేతికి చిక్కితే మరణాన్ని చేతులారా ఆహ్వానించినట్లేనని ఖమేనీని బాగా తెలుసు. ఆయనను ఖతం చేయడానికి ఇజ్రాయెల్ ఇప్పటిదాకా చేయని ప్రయత్నమే లేదు. ఇజ్రాయెల్ ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఎంతోమందిని హత్య చేసింది. కొద్ది రోజుల క్రితమే పేజర్ బాంబులతో హెజ్‌బొల్లా నాయకులను మట్టుబెట్టింది. ఖమేనీని మాత్రం కనీసం టచ్ చేయలేకపోయిందంటే ఆయన ఎంత సురక్షితంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. "ఏదో ఒకరోజు ఇజ్రాయెల్ నన్ను చంపేయడం ఖాయం. దేశం కోసం వీరమరణం పొందడం నాకు సంతోషమే" అని కొన్నేళ్ల క్రితం ఖమేనీ వ్యాఖ్యానించారు.

# రోబో ట్యాక్సీని ప్రారంభించిన టెస్లా

## ఏవీ.. డ్రైవర్ లేకుండానే!
## స్వయం చోదక వాహనాల పరుగులు
## భారత్‌లో ప్రారంభ దశలో ఏవీల అభివృద్ధి
## యూఎస్, చైనాలో ఇప్పటికే పరుగులు
## దారి చూపుతూ, దిశానిర్దేశం చేస్తున్న ఏఐ




అమెరికాలోని ఆస్టిన్ నగర వీధుల్లో ఒక ఎర్ర కారు.. దానిమీద 'రోబో ట్యాక్సీ' అని రాసి ఉంది. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ లేదా డ్రైవర్ రహిత కారు. ప్రపంచ ప్రసిద్ధ టెస్లా కంపెనీ ఈ రోబో ట్యాక్సీ సేవలను ఆదివారం ప్రారంభించింది. దీంతో ఇప్పుడు స్వయం చోదక వాహనాల (అటానమస్ వెహికల్ -ఏవీ) మీద చర్చ మరోసారి మొదలైంది. యూఎస్‌ఏలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని బీజింగ్ నగరంలో ఇప్పటికే ఏవీలు పరుగులు తీస్తున్నాయి. సరుకు రవాణా కోసం అటానమస్ ట్రక్స్ దూసుకెళుతున్నాయి. ప్రపంచంలో వాహనాల తయారీలో నాలుగో స్థానంలో ఉన్న భారత్‌లో.. ఏవీలు సాకారం అయ్యే అవకాశాలు ఎప్పుడెప్పుడా అని వాహన ప్రియులు ఎదురుచూస్తున్నారు. అసలు ఏవీలు ఎక్కడెక్కడ ఏయే స్థాయిల్లో ఉన్నాయి.. ఏవీ ఎలా పనిచేస్తుంది.. డ్రైవర్ లేకుండా ఇది ఎలా నడుస్తుంది?

### విదేశాల్లో ఇలా..

సాధారణ క్యాబ్స్‌తో పోలిస్తే పలు దేశాల్లో అటానమస్ వెహికల్స్ ఆధారిత క్యాబ్స్ సగం చార్జీలనే వసూలు చేస్తున్నాయి. ఒక్క యూఎస్‌లోనే ఒక ట్రిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు ఉన్నాయని ఊబర్ సీఈవో దారా కాస్రోసాహీ ఇటీవల వెల్లడించారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు చెందిన వేమో ఇప్పటికే యూఎస్, చైనాలో అటానమస్ వెహికల్స్‌తో రైడ్ హెయిలింగ్ సేవలు ఆఫర్ చేస్తోంది. యూఎస్‌కు చెందిన పోనీ.ఏఐ అటానమస్ క్యాబ్స్ సర్వీసులు అందిస్తోంది. అలాగే అటానమస్ ట్రక్స్ ద్వారా సరుకు రవాణా రంగంలోనూ ఉంది. భారత్‌కు చెందిన గౌతమ్ నారంగ్, అర్జున్ నారంగ్, అపేక్ష కుమావత్ కలిసి అమెరికాలో ఏర్పాటుచేసిన 'గతిక్.ఏఐ' అనే కంపెనీ అటానమస్ ట్రక్స్ ద్వారా వాల్‌మార్ట్ వంటి కంపెనీలకు సేవలందిస్తోంది. న్యూరో అనే కంపెనీ చిన్న అటానమస్ వ్యాన్స్ ద్వారా యూఎస్‌లో సరుకు రవాణా చేస్తోంది. చైనాలో డీప్‌రూట్.ఏఐ ఈ రంగంలో ఉంది. వీరైడ్, వాబి, మోషనల్, అరోరా తదితర కంపెనీలు సైతం ఆటానమస్ వెహికల్స్‌తో పోటీపడుతున్నాయి. అమెరికాలోని ఆస్టిన్ నగరంలో టెస్లా కంపెనీకి చెందిన రోబో ట్యాక్సీలను లాంఛనంగా ప్రారంభించారు. దశాబ్దాల కఠోర శ్రమకు ఇది ఫలితమని, అయితే ఇది పైలట్ ప్రాజెక్టేనని టెస్లా కంపెనీ అధినేత ఎలన్ మస్క్ తెలిపారు. ప్రస్తుతం ట్రిప్పునకు 4.20 డాలర్లు (సుమారు రూ.364) వసూలు చేస్తున్నారు. ఈ క్యాబ్స్ పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో మస్క్ ఇంకా ప్రకటించలేదు. మనదేశం విషయానికొస్తే.. టాటా మోటార్స్ ఇటీవల వైయు అనే పూర్తిస్థాయి అటానమస్ వాణిజ్య వాహనానికి పేటెంట్ పొందింది. దీనికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది వస్తువులు, ప్రయాణికుల రవాణాకు అనుకూలమైనది.

### మన దేశంలో ప్రారంభ దశలోనే..

అటానమస్ వెహికల్స్ రాకతో ఆటోమొబైల్ పరిశ్రమలో సాంకేతికంగా పెద్ద ముందడుగు పడిందని చెప్పవచ్చు. భారత్‌లో అటానమస్ వెహికల్స్ అభివృద్ధి ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పాలి. పూర్తిగా అటానమస్ అంటే డ్రైవర్ అవసరమే లేకుండా నడిచే వాహనాలు (లెవెల్-5) ఇంకా వాణిజ్యపరంగా అందుబాటులో లేనప్పటికీ.. అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఏడీఏఎస్) అభివృద్ధి, అటానమస్ దిశగా సాంకేతికతల పరీక్షల్లో పురోగతి ఉంది. భారత్‌లో మైనస్ జీరో, స్వాయత్ రోబోస్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా ఈలిక్సీ, ఫ్లక్స్ ఆటో, ఫ్లో మొబిలిటీ తదితర కంపెనీలు ఏవీల అభివృద్ధిపై దృష్టి సారించాయి. ఇదిలా ఉంటే.. డ్రైవర్‌లెస్ కార్లను భారత్‌లో అనుమతించేది లేదని పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెబుతూ వచ్చారు.

### 5 లెవెల్స్‌లో..

వాహనాల నియంత్రణ, నిర్వ హణ విషయంలో ఆటోమేషన్ స్థాయిని బట్టి లెవెల్-0 నుంచి పూర్తి అటానమస్ లెవల్-5 వరకు.. ఏవీలను 6 స్థాయిలుగా వర్గీకరించారు. లెవెల్ - 0 అంటే పూర్తిగా డ్రైవర్‌పైనే ఆధారపడి ఉంటుంది. లెవెల్ - 1లో అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ ఉంటుంది. ముందున్న వాహనం వేగాన్ని బట్టి ఏవీ దానంతట అదే వేగాన్ని నియంత్రించుకుంటుంది. లెవెల్ - 2లో సాంకేతికత స్టీరింగ్‌ను, వేగాన్ని నియంత్రిస్తుంది. లెవెల్ 1, 2లలో కచ్చితంగా డ్రైవర్ ఉండాల్సిందే. లెవెల్ -3లో ప్రత్యేక పరిస్థితుల్లో వాహనం దానంతట అదే నియంత్రించుకుంటుంది. కానీ, కొన్ని సందర్భాల్లో కారు ఇచ్చే అలర్ట్స్‌ను బట్టి డ్రైవర్ స్టీరింగ్‌ను తన చేతుల్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. లెవెల్ -4 అంటే.. చాలా అరుదుగా తప్ప, దాదాపుగా డ్రైవర్ అవసరం లేకుండానే కారు నడుస్తుంది. వీటిని ఎక్కడ పడితే అక్కడ నడపడం సాధ్యం కాదు. ప్రత్యేకమైన ప్రాంతంలోనే (జియో ఫెన్సింగ్ సాయంతో) నడుపుతారు. అంటే ఆ ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలే ఫీడ్ చేస్తారన్నమాట. ఆ పరిస్థితుల్లోనే కారు నడవగలదు. లెవెల్ - 5.. అసలు డ్రైవర్ అవసరమే ఉండదు. పూర్తిగా కారు తనంతట తానే నడుస్తుంది. ప్రపంచంలో లెవెల్ - 5 స్థాయి వాహనాలను ఎవరూ తయారుచేయలేదు.

### సెన్సార్స్, కెమెరాలతో..

అటానమస్ వెహికల్స్ వాటి పరిసరాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రూట్ మ్యాప్‌ను నిర్మించడానికి, నవీకరించడానికి పలు సెన్సార్లపై ఆధారపడతాయి. రాడార్ సెన్సార్లు సమీపంలోని వాహనాలను ట్రాక్ చేస్తాయి. కెమెరాలు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గుర్తిస్తాయి. అలాగే రహదారి సంకేతాలను అర్థం చేసుకుంటాయి. పాదచారులు, ఇతర వాహనాల కదలికలను గమనిస్తుంటాయి. లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సాంకేతికత దూరాలను కొలవడానికిబీ లేన్ గుర్తులను, రహదారి సరిహద్దులను గుర్తించడానికి లేజర్ పల్స్‌లను ఉపయోగిస్తుంది. వాహనం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాన్ని అధిక రిజొల్యూషన్ 3డీ మ్యాప్‌గా సృష్టిస్తుంది. అడ్డంకులు, పాదచారులు, ఇతర వాహనాలను గుర్తించడంలో సహాయపడుతుంది. వాహనాలను నిలిపేందుకు నిర్దేశించిన గీతలను, చుట్టూ ఉన్న కార్లను గుర్తించేందుకు చక్రాల దగ్గర పొందుపరిచిన అల్ట్రాసోనిక్ సెన్సార్లు సహాయపడతాయి. ట్రాఫిక్ సంకేతాలు, పాదచారుల సమాచారాన్ని ఇతర కెమెరాలు అందిస్తాయి. ఏవీల్లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్), ఇనెర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) కూడా ఉన్నాయి. లొకేషన్ కు సంబంధించిన సమాచారాన్ని జీపీఎస్ అందిస్తుంది. వాహన వేగం, దిశలో వచ్చే మార్పును ఐఎంయూ ట్రాక్ చేస్తుంది. సెన్సార్స్ అందించిన డేటాను అత్యంత సామర్థ్యం గల సాఫ్ట్‌వేర్ ప్రాసెస్ చేస్తుంది. ఇది సరైన మార్గాన్ని నిర్ణయించడంతోపాటు వాహన వేగం, దిశ, బ్రేకింగ్, స్టీరింగ్‌ను నియంత్రిస్తుంది. ముందే పొందుపరిచిన ట్రాఫిక్ నియమాలు, అడ్డంకులను గుర్తించే విధానాలు, పరిసరాల అధ్యయనం, మనుషులు, యంత్రాల గుర్తింపు ద్వారా ఈ సాంకేతిక వ్యవస్థ సురక్షిత, సమర్థవంత ప్రయాణాన్ని అందిస్తుంది.